

‘కంగ్రాట్స్ మై ఫ్రెండ్’ అంటూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ట్రంప్‌ను అభినందించారు. చారిత్రక విజయం సాధించిన ట్రంప్‌కు అభినందనలు, భవిష్యత్తులో భారత్, అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కలిసి పనిచేద్దామని మోడీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, సుస్థిరతలకు కలిసి కృషి చేద్దామన్నారు.


Truth of News

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



గురువారం 07 నవంబర్ 2024 తిరుపతి

సంపుటి 1 సంచిక 140 పేజీలు 08 వెల: రూ.6.00

Published from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## భూకబ్జాలకు పాల్పడితే

# కేసులు నమోదు

- ముసాయిదా బిల్లుకు క్యాబినెట్ ఆమోదం
- సీఆర్‌డీఏ 8,352 చదరపు కిలోమీటర్లకు పునరుద్ధరణ
- పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు
- కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పురుద్ధరణ



**అమరావతి-సూర్య వాస్తవం**

రాష్ట్రంలో భూ కబ్జాలకు పాల్పడే వారికి ఇకపై కఠిన శిక్షలు పడనున్నాయి. ఈ మేరకు రూపొందించిన ఎపి ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ బిల్లుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం 1982 నాటి చట్టాన్ని రద్దు చేసి ,దాని స్థానంలో నూతన బిల్లును

- మిగతా 2లో..

## ప్రత్యేక హోదా

# పునరుద్ధరించండి

- జమ్మూకాశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం ఆమోదం
- రచ్చకు బీజేపీ యత్నం



**శ్రీనగర్-సూర్య వాస్తవం**

జమ్మకాశ్మీర్‌కు ప్రత్యేక హెూదాను పునరుద్ధరించాలని కోరుతూ జమ్మూకాశ్మీర్ శాసనసభ బుధవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. బిజెపి శాసన సభ్యులు దీనిని వ్యతిరేకించారు. అసెంబ్లీలో రచ్చకు యత్నించారు. రాష్ట్ర హెూదా పునరుద్ధరణ కోరుతూ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు, ఉప ముఖ్యమంత్రి సురీందర్ కుమార్ చౌదరి శాసనసభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ ఆర్టికల్ 370 హామీ ఇచ్చిన ప్రత్యేక హెూదా పునురుద్ధరించాలని ఈ సభ కోరుతోంది అన్నారు. జమ్మూకాశ్మీర్ ప్రజల గుర్తింపు, సంస్కృతి, హక్కులను పరిరక్షణకు ఇది అవసరం, దీనిని కేంద్రం గతంలో ఏకపక్షంగా తొలగించడంపై ఈ సభ ఆందోళన వ్యక్తం చేస్తోంది’ అని ఆ తీర్మానంలో తెలియ జేశారు. ప్రత్యేక హెూదా, రాజ్యాంగ గ్యారంటీల పునరు ద్ధరణ కోసం జమ్మూకాశ్మీర్ ప్రజా ప్రతినిధులతో సంప్ర దింపులు ప్రారంభించాలని, రాజ్యాంగ వ్యవస్థలపై దృష్టి సారించాలని ఆ తీర్మానంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

- మిగతా 2లో..

# అమిత్ షాతో పవన్ భేటీ



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం**

రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చర్చించారు. ఈ మేరకు బుధవారం అమిత్ షా నివాసంలో ఆయనతో పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఐదు నెలలు కావస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. లడ్డూ వివాదంతో మొదలైన రచ్చ, సనాతన ధర్మ పరిరక్షణ వరకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు జోక్యంతో తాత్కాలికంగా ఈ అంశం సర్దుమణిగింది. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్న నేపథ్యంలో పవన్‌కల్యాణ్ పిఠాపురం పర్యటనలో చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో సంచలనమయ్యాయి. ఇప్పటి వరకు ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి, కానీ పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలతో కూటమిలో ఉన్న వారి నుంచే రాష్ట్రంలోని శాంతి

- మిగతా 2లో..

## టీటీడీ చైర్మన్‌గా

# బి.ఆర్.నాయుడు

**తిరుమల-సూర్యవాస్తవం**



తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మకర్తల మండలి చైర్మన్ గా బి.ఆర్.నాయుడు బుధవారం ఉదయం శ్రీవారి ఆలయంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా క్షేత్ర సాంప్రదాయం పాటిస్తూ బి.ఆర్.నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ భూ వరహాస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుండి ఆలయానికి విచ్చేశారు. ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ అధికారులు బి.ఆర్.నాయుడుకు స్వాగతం పలికారు. ఆలయంలో బంగారు వాకిలి వద్ద టీటీడీ ఈవో జె.శ్యామలరావు బి.ఆర్.నాయుడు తో ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకోగా రంగ నాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఈవో చైర్మన్ ను శాలువతో సన్మానించి స్వామివారి ప్రసాదం, చిత్రపటం, టీటీడీ డైరీలు, క్యాలెండర్ లు అందించారు. అనంతరం ధర్మకర్తల మండలి సభ్యులుగా దేవాదాయశాఖ సెక్రటరీ సత్య నారాయణ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జంగా కృష్ణమూర్తి, మల్లెల రాజశేఖర్ గౌడ్, జాస్తి పూర్ణ సాంబశివరావు, ఎం.ఎస్.రాజు, నర్సిరెడ్డి, బూంగునూరు మహేందర్ రెడ్డి, అనుగోలు రంగ శ్రీ, ఆనంద్ సాయి, జానకి దేవి తమ్మిశెట్టి, ఆర్.ఎన్.దర్శన్, ఎం.శాంతారామ్, ఎస్.నరేష్ కుమార్, డాక్టర్ ఆదిత్ దేశాయ్ లు ప్రమాణం స్వీకారం చేశారు. వీరిచే టీటీడీ అడిషనల్ ఈఓ

- మిగతా 2లో..

## ప్రభుత్వమే

# సర్దుబాటు చేయాలి

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల**



**అమరావతి-సూర్యవాస్తవం**

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాన్ని ప్రజలపై వేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి బాబు మద్దతు ఇస్తున్నందున, అక్కడి నుంచి నిధులు రాబట్టి డిస్కమ్‌లకు రాష్ట్ర ప్రభుత్వమే సర్దుబాటు చేయాలన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా విజయవాడలోని ధర్నా చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యాన లాంతర్లతో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన 5 నెలల్లోనే ప్రజలకు హై ఓల్టేజ్ షాక్‌లు ఇచ్చి చుక్కలు చూపిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రూ.6 వేలకోట్లు భారాన్ని ప్రజలపై వేశారని, తాజాగా మరో రూ.11 వేలకోట్ల భారం వేసేందుకు సిద్ధమవ్వడాన్ని తప్పుబట్టారు. తాము అధికారం చేపడితే విద్యుత్ ఛార్జీల పెంపే ఉండదని,

- మిగతా 2లో..



## జనగణనలో కులసర్వేను

# పరిగణనలోకి తీసుకోవాలి

**- కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని గవర్నర్‌ను కోరిన సీఎం**

**హైదరాబాద్-సూర్య వాస్తవం**

దేశవ్యాప్తంగా 2025లో చేపట్టబోయే జనగణనలో తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వేను పరిగణనలోకి తీసుకునే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు.

ఈ సర్వే విషయంలో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా నిలవనుందని తెలిపారు. బుధవారం నుంచి ప్రారంభమైన సర్వే తీరును, ప్రక్రియను, పూర్తి స్థాయి వివరాలను ఈ సందర్భంగా గవర్నర్‌కు ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం సీఎం తన సోదరుని కూతురు వివాహానికి గవర్నర్‌ను ఆహ్వానించారు. గవర్నర్‌తో భేటీ అయిన వారిలో సీఎంతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, గుత్తా అమిత్ రెడ్డి ఉన్నారు.


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ప్రత్యేక హోదా
# పునరుద్ధరించండి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర హోదా పునరుద్ధరణకు చేపట్టే ఏ ప్రక్రియ అయినా దేశ ఐక్యతను, జమ్మూకాశ్మీర్ ప్రజల చట్టబద్ధమైన ఆకాంక్షలను పరిరక్షించాలని తెలిపారు. ఈ తీర్మానాన్ని ఎన్‌సి నాయకులు, ఆరోగ్య మంత్రి సకీనా టూ బలపర్చారు. స్పీకర్ అబ్దుల్ రహీమ్ రాథర్ ఈ తీర్మానాన్ని ఓటింగ్ కోసం ఉంచారు. మెజార్టీ సభ్యులు దీన్ని ఆమోదించారు. ఎన్‌సితోపాటు, పిడిపి, ఎఐపి, జమ్ముకాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ చీఫ్ సజాద్ లోన్, స్వతంత్ర సభ్యులు షబీర్ కుల్లారు తీర్మానికి మద్దతు పలికారు. అయితే ఈ తీర్మానంపై బిజెపి ఎమ్మె ల్యేలు రెచ్చిపోయారు. సభ ఆమోదించినా తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో సభను స్పీకర్ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన తరువాత కూడా బిజెపి సభ్యులు గలభా సృష్టించడంతో సభను రేపటికి వాయిదా వేశారు. జమ్మూకాశ్మీర్ శాసనసభకు పదేళ్ల విరామం తర్వాత ఇటీవలే ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలు తర్వాత అసెంబ్లీ సమావేశం కావడం ఇదే మొదటిసారి.

# అమిత్ షాతో పవన్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

భద్రతలపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి ఈ అంశాలపై పవన్‌కల్యాణ్ చర్చించినట్లు తెలిసింది. తొలుత గన్నవరం నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న పవన్‌కల్యాణ్ అక్కడ నుంచి నేరుగా ఏపి భవన్‌కు చేరుకున్నారు. అక్కడ కొద్ది సేపు ఉన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తాను డిప్యూటీ సిఎం అయిన తరువాత తొలిసారి కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలుస్తున్నానని, ఇది మర్యాదపూర్వక భేటీ అని అన్నారు. అనంతరం అక్కడ నుండి అమిత్ షా నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు భేటీ అనంతరం అక్కడ నుంచి నేరుగా ఢిల్లీ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. అక్కడ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు.

# టీటీడీ చైర్మన్‌గా బి.ఆర్.నాయుడు

(మొదటిపేజీ తరువాయి)

చి.హెచ్.వెంకయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. వీరికి రంగ నాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదాలు అందించగా అధికారులు శ్రీవారి చిత్ర పటం, డైరీలు, క్యాలెండర్లు అందజేశారు. మధ్యాహ్నం 2 గంటలకు పి.రామ్మూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవోలు లోకనాథం, ప్రశాంతి, భాస్కర్ పాల్గొన్నారు.

# ఆమ్రపాలి బాధ్యతలు స్వీకరణ



**అమరావతి-సూర్య వాస్తవం:** పర్యాటకశాఖ ఎమ్‌డిగా ఆమ్రపాలి బాధ్యతలు తీసుకున్నారు. విజయవాడలోని ఆటోనగర్‌లో ఉన్న పర్యాటకశాఖ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కేడర్‌కు చెందిన ఆమ్రపాలి ఇప్పటి వరకు తెలంగాణలో పనిచేశారు. రాష్ట్రానికి వెళ్లాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) ఇటీవల ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే.

# వేగవంతంగా విద్యార్థులకు అపార్ నమోదు

**- నవంబర్ 20 నాటికి పూర్తి - జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి-సూర్య వాస్తవం:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులకు అపార్ నమోదు ఈ నెల 20 నాటికి పూర్తి చేయాలని సంబందిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లాలోని డిఈఓ, ఎంపిడిఓ లు, డిప్యూటీ ఈఓలు , ఎంఈఓ లతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం -2020 లో భాగంగా భారత ప్రభుత్వ ఒకే దేశం, ఒకే స్టూడెంట్ కార్డు పేరుతో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, కాలశాలలోని విద్యార్థులకు అపార్ (ఆటోమెటెడ్ పర్మనెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ ) నమోదు కార్యక్రమం ప్రవేశ పెట్టిందని దీని ద్వారా విద్యార్థులకు ప్రత్యేక 12 అంకెలు గల గుర్తింపు కార్డును అందించనున్నదని దీనితో విద్యార్థులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్డు ద్వారా విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జెండర్, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు నంబర్ అన్నీ కలిపి డిజిటల్ రూపంలో భద్రపరచడం జరుగుతుందని, విద్యార్థులు దేశంలో ఎక్కడైనా చదువుకునే వెసులుబాటు కలుగుతుందని, విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల వివరాలు నమోదు, ధృవీకరణ సులభం అవుతుందని తెలిపారు. ఈ కార్డు ద్వారా విద్యార్థుల అకాడమిక్ సమాచారం, విద్యార్థులు చదువుకునే విధానం, విద్యార్థి సాదించిన మార్కులు, గ్రేడ్లు, ఉపకార వేతనాలు, క్రీడల్లో సాధించిన అంశాలు, డిజిటల్ లాక్ ద్వారా ఆన్లైన్లో అనుసంధానమై ఉండటంతో సర్టిఫికెట్లు డౌన్లోడ్ చేసుకోవడం, విద్యార్థుల సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం డిఈఓ వివరిస్తూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, పాఠశాలలలో 3,07,330 మంది విద్యార్థులు ఉన్నారని, ఇప్పటి వరకు 2,06,651 మంది విద్యార్థులకు అపార్ నమోదు చేసి 67 శాతం సాధించి రాష్ట్రంలో ప్రస్తుతం 4 వ స్థానంలో ఉన్నామని తెలిపారు. మిగిలిన విద్యార్థులకు నమోదు చేసేటప్పుడు ఆధార్ కార్డు, స్కూల్ అడ్మిషన్ ఫామ్ లో పేర్లు సరి పోలనందు వల్ల అపార్ నమోదు పూర్తి కావడం లేదని తెలిపారు. తిరుపతి రూరల్ మండలం 54 శాతం పెండింగ్ , కోట మండలంలో 47 శాతం , సూళ్ళూరుపేటలో 44 శాతం పెండింగ్ ఉందని తెలిపారు. అలాగే కొన్ని ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలు నమోదు చేయించేందుకు సహకరించడం లేదని తెలిపారు. ఈ నెల 20 నాటికి అపార్ నమోదు పూర్తి చేయాలనీ, ప్రతి ఒక్క విద్యాసంస్థలు సహకరించి విద్యార్థుల నమోదు చేయించాలని అలాగే సంబంధిత ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలు సహరించకపోతే చర్యలు ఉంటాయని, నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# భూ కబ్జాలకు పాల్పడితే కేసులు నమోదు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకురావాలన్న ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. భూ కబ్జాలకు పాల్పడే వారికి 10నుంచి 14 సంవత్సరాల జైలు శిక్ష తో పాటు కబ్జా చేసిన స్థలం విలువతో పాటు నష్టపరిహారాన్ని వసూలు చేసేలా నూతన బిల్లును రూపొందించినట్లు తెలిపారు. దీంతో పాటు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ-సిఆర్‌డిఎ) పరిధిని పూర్వస్థాయికి తీసుకురావాలన్న ప్రతిపాదనను కూడా క్యాబినెట్ ఆమోదించినట్లు మంత్రి చెప్పారు. తొలుత సిఆర్‌డిఎ పరిధిని 8,352 కి.మీగా తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించగా, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 1,069.55 కి.మీకు కుదించిన విషయం తెలిసిందే. తాజా మంత్రివర్గ సమావేశంలో వైసిపి ప్రభుత్వం తీసుకున్న ఆ నిర్ణయాన్ని రద్దు చేసి తిరిగి పూర్వపు స్థాయికి (8,352 కి.మీకు)సిఆర్‌డిఎను విస్తరించాలని నిర్ణయించారు. దీనితో సత్తెనపల్లి మున్సిపాల్టీతో పాట పల్నాడు జిల్లాల్లోని ఆరు మండలాలకు చెందిన 92 గ్రామాలు, బాపట్లజిల్లాలోని 5మండలాలకు చెందిన 62 గ్రామాలు తిరిగి సిఆర్‌డిఎ పరిధిలోకి రానున్నాయి.

అదేవిధంగా డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహించే పీఠాపురం నియోజకవర్గ అభివృద్ధికోసం పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదించింది.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి చెందిన కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని పునరుద్ధరించాలన్న ప్రతిపాదనను క్యాబినెట్ ఆమోదించింది, ఎపి డ్రోన్ పాలసీ 4.0కి మంత్రి మండలి ఆమోదముద్ర వేసింది. రాష్ట్రాన్ని డ్రోన్ హబ్‌గా మార్చేందుకు కర్నూలులో డ్రోన్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎపి డేటా సెంటర్ పాలసీ 4.0ని కూడా మంత్రి మండలి ఆమోదించింది.

# తెలుగు రాజకీయాల్లోకి నటి కస్తూరి



**తిరుపతి-సూర్య వాస్తవం:** తమిళనాడులో అధికార డీఎంకే నేతల టార్చర్ భరించలేకపోతున్నానని, తనకు హైదరాబాద్ అభయం ఇచ్చిందన్నారు. ఇప్పటివరకూ తమిళ రాజకీయాలపై మాట్లాడాను, కానీ ఇప్పుడు చెబుతున్నా.. తెలుగు రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తానని ప్రకటించారు. తనను ఎంతగానో ఆదరించిన తెలుగు వారికి తనను దూరం చేయాలన్న ప్రయత్నం జరుగుతుందన్నారు. తెలుగు ప్రజలకు తాను రుణపడి ఉంటున్నానని, ఇక్కడి రాజకీయాల్లోకి వచ్చి వారి కోసం పాటుపడతా అన్నారు. తమిళంలో తాను చేసిన వ్యాఖ్యలపై వివరణ అడగకుండా తిట్టారని, తెలుగు ప్రజలు మాత్రం మీరు ఇలా అన్నారా, కామెంట్లు చేశారా వివరణ కోరారని.. దటీజ్ తెలుగు ప్రజలు అన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తాను అభిమానినని, ఆయన దారిలో నడుస్తానని నటి కస్తూర్తి సంచలన ప్రకటన చేశారు. నేను ఈరోజు ట్రెండింగ్ లో ఉన్నాను, కానీ మంచి విషయంలో కాదంటూ నటి కస్తూరి ఆవేదన వ్యక్తం చేశారు. తమిళంలో తాను చేసిన వ్యాఖ్యల్ని తెలుగులో తప్పుగా అనువాదం చేశారని తన ఇంటివద్ద తెలుగు మీడియాతో అన్నారు. సర్వ సామాజిక సమావేశంలో డీఎంకే చేసే అన్యాయాలు, నేరాలను విమర్శించడం, ఎత్తి చూపడంతో వారు తనపై దుష్ప్రచారం చేశారని కస్తూరి పేర్కొన్నారు. డీఎంకే సిద్ధాంతం తెలుగువాళ్లు తెలుసుకోవాలి. దేవుడు లేడని డీఎంకే నేతలు అంటారు. ముఖ్యంగా హిందూ దేవతలు, దేవుళ్ల లేరు. సనాతన ధర్మాన్ని విశ్వసించేవాళ్ల తెలివి తక్కువ వాళ్లు అని డీఎంకే వాళ్లు భావిస్తారు. బ్రాహ్మణులు అనేవారు స్థానికులు కాదు, పరదేశీయులు అని వాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలనేది కూడా డీఎంకే సిద్ధాంతం. ఈ విషయాలను ఎత్తిచూపానన్న కారణంగా నాపై ఎన్నో వదంతులు ప్రచారం చేశారు. తాగుబోతు అన్నారు. ఎవరెవరితోనే అక్రమ సంబంధాలు ఉన్నాయని ప్రచారం చేసినా వాటిని అంతగా పట్టించుకోలేదు. తెలుగు ప్రజలను కస్తూరి కించపరిచిందంటూ తనపై డీఎంకే నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేను మాట్లాడిన ఆ వేదిక మీద తెలుగువాళ్లు కూడా ఉన్నారు. నా మెట్టినిల్లు తెలుగు ప్రాంతం. నా పిల్లల రక్తంలో తెలుగుదనం ఉంది. ఎవరు వచ్చినా తెలుగువాళ్లు ప్రేమ చూపిస్తారు. వేరే వాళ్లను అయినా ప్రోత్సహించేతత్వం వారిది. ఒక నేత ఫ్యామిలీని ఉద్దేశించి మాట్లాడా. ఓపెన్ గా దీని గురించి నిజాలు చెప్పినా ఇది మరో రగడ, కేసు అవుతుంది. రాజకీయాల్లో నేను లేకుండా చేయాలన్నది డీఎంకే నేతల ఉద్దేశం. అందుకు నన్ను టార్గెట్ చేసుకుని, నా వ్యాఖ్యల్ని దుష్ప్రచారం చేస్తున్నారు. తిరుమల లడ్డూ కల్తీ వివాదం సమయంలో తెలుగు వారు ఎంతో బాధపడ్డారు. ఈ విషయంపై డీఎంకే వాళ్లు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీరు రోజూ బీఫ్ కొవ్వు తిన్నారు కదా, బాగుందా, రోజూ అలాగే తినండంటూ డీఎంకే నేతలు తెలుగు వారిని అపహాస్యం చేశారు. కేవలం తెలుగు ప్రాంతం నుంచి తమిళనాడుకు వలస వచ్చిన వారిని ఉద్దేశించి మాట్లాడా. ఎక్కడినుంచి వచ్చినా వారి సొంతమని చెప్పలేకపోతున్నారు. తమిళనాడులో 5 మంది తమిళ మంత్రులు ఉన్నారు. రాష్ట్ర ప్రజలకు ఈ విషయం తెలిసి సమస్య అవుతుందని, డీఎంకే నేతలు నా వ్యాఖ్యల్ని వక్రీకరించారు. తెలుగు వారిపై దుష్ప్రచారం చేసిన బాధ పెట్టిన డీఎంకే నేతలు క్షమాపణ చెప్పాలి. తెలుగు వారి మనో భావాలను దెబ్బతీసిన వ్యక్తులు సారీ చెప్పకపోతే వారి తరఫున నేను క్షమాపణ చెబుతాను' అన్నారు. తాను తమిళంలో చేసిన కామెంట్లను డీఎంకే నేతలు తెలుగు, ఇంగ్లీష్ లో తప్పుగా అనువాదం చేసి ఏపీ, తెలంగాణలోని తెలుగు వారికి వీడియోలు షేర్ చేస్తున్నారని నటి కస్తూరి తెలిపారు. మొన్నటివరకూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై దారుణమైన కామెంట్స్ చేసిన డీఎంకే నేతలు, నేడు ప్రేమ కురిపిస్తూ ఆయనకు ఎందుకు ట్యాగ్ చేస్తున్నారని ఆలోచించాలన్నారు. డీఎంకే నేతలు చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని నమ్మకుండా తెలుగు ప్రజలు తిప్పికొట్టాలని, మీ అమ్మాయిని నమ్మాలన్నారు. తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే నేతలు నుంచి తాను నటిగా, మహిళగా, నాయకురాలిగా ప్రతిరోజూ వేధింపులు ఎదుర్కొంటున్నానని సంచలన విషయాలు తెలిపారు

## నిందితుడిని
# కఠినంగా శిక్షించేలా చర్యలు

**- వడమాల పేట అఘాయిత్యానికి ప్రభుత్వం చర్యలు**
**- ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్.టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్**





**తిరుపతి-సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా వడమాల పేట మండలంలో మూడున్నర ఏళ్ల బాలిక పై జరిగిన అఘాయిత్యానికి ప్రభుత్వం సకాలంలో స్పందించి చర్యలు తీసుకున్నదనీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్.టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్.టి కమిషన్ సభ్యులు తిరుపతి జిల్లాలోని వడమాల పేట మండలం ఏ.ఎం పురం గ్రామంలోని ఎస్.టి కాలనీలో పర్యటించి ఆరు రోజుల క్రితం మూడున్నర ఏళ్ల పసి పాప పై జరిగిన సంఘటన గురించి మాట్లాడుతూ ఇటీవలే ఏ.ఎం పురం గ్రామంలోని ఎస్.టి కాలనీలో అత్యంత పాశవికంగా హత్యకు గురయిన మూడున్నర ఏళ్ల గిరిజన బాలికను అదే గిరిజన కులానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి హత్య చేశాడని, ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, పోలీసులు, వెంటనే స్పందించి నిందితుడిని పట్టుకుని, రిమాండ్ కి తరలించారని, ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ బాదిత కుటుంబానికి పది లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటిస్తూ స్వయంగా హోమ్ మినిస్టర్ ఏఎం పురం గ్రామానికి వచ్చి అందచేయడం జరిగిందని తెలిపారు. నిరుపేద గిరిజన యానాది కుటుంబానికి చెందిన వీరికి న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పెషల్ కేస్ కింద పరిగణలోనికి తీసుకొని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయనుండడం శుభపరిణామం అని అన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులుగా ఈ రోజున ఒక బాధ్యతగా, గిరిజన కుటుంబాన్ని ఓదార్చాలని, వారిలో మనోధైర్యాన్ని నింపాలని వడమాల పేట మండలంలోని ఎఎం పురం గ్రామానికి రావడం జరిగిందని, జరిగిన సంఘటనపై బాలిక తల్లిదండ్రులను అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. బాలిక తల్లిదండ్రులు తమ పాప ను చంపిన నిందితునికి చట్టం ద్వారా శిక్షించాలని, ఇలాంటివి రాష్ట్రంలో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారని అన్నారు. మండలంలోని ఎఎం పురం ఎస్టీ కాలనీ లో ఇటీవల హత్య కు గురైన బాలిక తల్లిని బుదవారం ఎస్టీ కమిషన్ సభ్యులు పరామర్శించారు. నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోంటుందని ధైర్యం చెప్పారు. బతుకు తెరువు కోసం ఉద్యోగ అవకాశం కల్పించాలని, తమ సొంత మండలం కేవిబి పురంలో ఇంటి స్థలం తో పాటు ఇల్లు కట్టించాలని కోరింది. ఆయన స్పందిస్తూ జిల్లా కలెక్టర్ కు పూర్తి స్థాయిలో నివేదిక పంపి తొందరలోనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అట్లే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడి పై తొందరగా శిక్ష పడేలా చర్యలు తీసుకొంటామని చెప్పారు. స్థానికులు గ్రామానికి స్మశానం లేదని విన్నవించారు. గ్రామ పరిసరాల్లో స్థలాన్ని గుర్తించి స్మశానానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్ జరీనాకు ఆదేశించారు గ్రామం లో నెలకొన్న మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు దీనిపై సమగ్ర నివేదికను కమిషన్ కు అందజేయాలి అన్నారు. ఈ కార్యక్రమం లో తిరుపతి జిల్లా డిటిడబ్ల్యూఓ బి. సూర్యనారాయణ , డీఎస్పీ రవికుమార్, సిఐ, భాస్కర్ నాయక్, ఎస్.ఐ అమర్నాధ రెడ్డి, ఎంపిడిఓ శేషగిరి రావు గిరిజన సంఘాల నాయకులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

## సంపాదకీయం

# 1931 జనాభా లెక్కలేనా..!

దేశంలో సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించాలన్నా.. వెనుకబడిన వర్గాలు ముందుకు వెళ్లాలన్నా.. కులగణన ఒకటే మందు అని చాలా మంది నమ్ముతున్నారు. జమానా లెక్కలు కాకుండా లేటెస్ట్ సెన్సెస్ తోనే అసలైన పేదల గుర్తింపు సాధ్యమవుతుందన్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేయబోతున్న సర్వే దేశానికే రోల్ మోడల్ గా ఉంటుందంటున్నారు. బీసీలకు రిజర్వేషన్లు, వారి జనగణన ఇష్యూ దేశవ్యాప్తంగా మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. దేశంలో బీసీల జనాభా లెక్కలు తీయాలన్న డిమాండ్లు ఈనాటివి కావు. అయితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మాత్రం ఈ లెక్కలు తీసేందుకు ముందుకు రావడం లేదంటున్నాయి విపక్షాలు. అసలు బీసీల్లో ఏయే కులాల్లో ఎంత మంది ఉన్నారన్న విషయం తెలిస్తే వారి సమగ్ర సంక్షేమానికి వీలవుతుందని బీసీ సంఘాల ఆలోచన. అందుకోసం బీసీ జనగణన ఒక్కటే మార్గమంటున్నారు. దేశ జనాభాలో ఎక్కువ శాతం బీసీలే ఉన్నారు. బీసీల సంఖ్య 70 కోట్ల ఉన్నట్లు ఓ అంచనా ఉంది. ఆ లెక్కన ఇది 56 శాతం. 90 ఏళ్ల నాటి డేటా ఆధారంగానే ఇప్పటికీ బీసీ రిజర్వేషన్లు కొనసాగుతున్నాయంటున్నారు. పదేళ్లకోసారి దేశంలో జనాభాను లెక్కిస్తున్నా.. అందులో దళితులు, గిరిజనుల సంఖ్యపై మాత్రమే స్పష్టమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. అయితే జనాభాలో ఓబీసీతో పాటు ఏ ఏ కులాల వారు ఎంతమంది ఉన్నారన్న సమగ్ర సమాచారం సేకరించడం లేదు. దేశంలో 1931లో చేసిన జనాభా లెక్కలే సంపూర్ణంగా కులగణనలతో చేసిన సమగ్ర లెక్కలుగా ఉన్నాయంటున్నారు. ఇప్పటికీ అవే ఆధారంగా మారాయి. 1979లో బీపీ మండల్ నేతృత్వంలో రెండో బీసీ కమిషన్ ను ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ బీసీల జనాభాను 52 శాతంగా లెక్కగట్టి వీరికి విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 1980లో రిపోర్ట్ ఇచ్చింది. ఈ సిఫార్సులు 1992 నుంచి అమల్లోకి వచ్చాయి. దేశంలో 3,743 కులాలను బీసీలుగా మండల్ కమిషన్ తేల్చింది. అయితే కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ లిస్టులో 2,479 కులాలు మాత్రమే ఉన్నాయి. సర్వే చేస్తేనే బీసీల్లో ఉన్న కులాల లెక్క తేలే ఛాన్స్ ఉందంటున్నారు. 2017లో జస్టిస్ రోహిణి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ను నియమించింది. ఓబీసీ జాబితాను వర్గీకరించడం ఈ కమిషన్ పని. ఇప్పటికి ఈ కమిషన్ గడువును 13సార్లు పొడగించారు. ప్రస్తుతం బీసీల జనగణనపై కాంగ్రెస్, జేడీయూ, సమాజ్ వాదీ సహా మరికొన్ని పార్టీలు అగ్రెసివ్ గా వెళ్తున్నాయి. వీలైన ప్రతిసారీ మోడీ సర్కార్ పై ఒత్తిడి పెంచుతున్నాయి. బీసీ కుల గణనతో చాలా లాభాలు ఉన్నాయని బీసీ సంఘాలు, విపక్షాలు అంటున్నాయి. వెనుకబడిన మెజార్టీ ప్రజలకు ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలు చేయడం, జనాభాకు తగ్గట్లుగా విద్యా, ఉద్యోగాల్లో తగినంత ప్రాతినిథ్యం దొరకడం, బీసీల్లోని పేదలకు రిలీఫ్ లభిస్తుందని అంటున్నారు. సీన్ కట్ చేస్తే బీసీల లెక్కలు తీసేందుకు మోడీ ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తోందన్న ప్రశ్నలు వస్తున్నాయి. కులగణనపై సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం కులాల వారీగా వెనుకబడిన తరగతుల జనగణన చేపట్టడం పాలనాపరంగా కష్టమని తెలిపింది. అయితే దీన్ని విపక్షాలు, బీసీ సంఘాలు తప్పు బట్టాయి. బీసీ కులాల వారీ లెక్కలు తీస్తే అందరికీ రిజర్వేషన్లు కల్పించడం కష్టమన్న ఆలోచనతో ఉన్నారా అన్న డౌట్లు వస్తున్నాయి. ఇప్పటికే రిజర్వేషన్ల కోటా 50 శాతం దాటొద్దని సుప్రీం తీర్పు ఉంది. ఆ లెక్కన చూసినా ఈ సబ్జెక్ట్ ముట్టుకుంటే మొదటికే ఇబ్బంది వస్తుందన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఉందా అన్నది కీలకంగా మారింది. నిజానికి 2010లో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు.. ఇదే బీజేపీ నాయకులు.. బీసీ కులాల వారిగా లెక్కలు తీయాలని పార్లమెంటులో డిమాండ్ చేశారు. ఇప్పుడు అదే బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. అటు బీసీల కులాల వారీ జనాభా లెక్కలు తీయడంతో పాటే పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఆర్.కృష్ణయ్య వంటి నేతలు డిమాండ్ చేస్తున్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తేలాలంటే, బీసీల లెక్కలు తప్పనిసరిగా ఉండాలని గతంలో సుప్రీం ఆదేశించింది. లేకపోతే రిజర్వేషన్లు లేకుండానే ఎన్నికలు జరపాలని గతంలో తీర్పు ఇచ్చింది. దీంతో చాలా రాష్ట్రాల్లో కన్ఫ్యూజన్ మొదలైంది. కొన్ని రాష్ట్రాలు సొంతంగా బీసీల లెక్కలు తీసే పనిలో పడ్డాయి. ఇక తెలంగాణలో ప్రతి ఇంటిలోని కుటుంబ సభ్యులను సర్వే చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఆయా ప్రాంతాలలోని జనాభాను బట్టి అక్కడ సిబ్బందిని నియమించారు. ఎన్యూమరేటర్ రోజువారీగా తనకిచ్చిన షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తయ్యే వరకు పనిచేస్తారు. నేటి నుంచి జరిగే ఈ సర్వేలో ప్రతి కుటుంబ యజమానిని నేరుగా ఎన్యుమరేటర్ కలిసి వివరాలు సేకరిస్తారు. యజమాని లేకుంటే తగిన ఆధారాలు చెప్పే ఏ కుటుంబ సభ్యుడున్నా సరిపోతుంది. ఇలా సేకరించిన సమాచారం మొత్తం ఈ నెల చివరి నాటికి ఆన్‌లైన్‌లో అప్లోడ్చేస్తారు. సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, విద్య, ఉపాధి వంటి అంశాలను సేకరించనున్నారు. వివరాల సేకరణ అనంతరం సంబంధిత ఇళ్లకు స్టిక్కర్లు అంటించనున్నారు. ఏ రోజు.. ఏ గ్రామంలో.. ఏ వార్డులో.. ఏ సమయంలో.. సర్వే చేయపట్టనున్నారనే సమాచారాన్ని ముందే ఆయా ప్రాంతాల్లోని వారికి చాటింపు, మైకుల్లో ప్రచారం ద్వారా తెలియజేస్తారు. సర్వేలో భాగంగా ఎలాంటి ఫొటోలు, గుర్తింపు పత్రాలు స్వీకరించరు.




తిరుమల-సూర్య వాస్తవం

ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ సతీమణి స్నేహ రెడ్డి సన్నిహితులతో కలిసి బుధవారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆమెకు రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు పట్టు వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల భక్తులు అభిమానులు సెల్ఫీలు దిగారు.

# పవన్ గ్రౌండ్‌లోకి ఎంటర్ అయినట్టేనా..!

అమరావతి-సూర్య వాస్తవం



జనసేన అధినేత పవన్ కల్యాణ్ మళ్లీ ఎన్నికలకు ముందు తరహా రాజకీయాలను ప్రారంభించినట్లే కనపడుతుంది. ఫుల్లు ఎఫెన్స్ లో కనపడుతున్నారు. నిన్నటి వరకూ తన పని ఏదో తాను చూసుకుంటూ పవన్ కల్యాణ్ పెద్దగా బయటకు కనిపించలేదు. ఆయన తనకు కేటాయించిన శాఖలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖలను ఆయన పూర్తిగా అధ్యయనం చేశారు. అధికారులతో సమీక్షలు, ఉత్తర్వులకే పరిమితమైన పవన్ కల్యాణ్ నేడు గ్రౌండ్ లోకి ఎంటర్ అయ్యారు. వచ్చీ రావడంతోనే ఇటు కూటమి ప్రభుత్వంపైనా, అటు విపక్షంపైనా విరుచుకుపడుతూ వెళ్లడం దేనికి సంకేతం అన్న చర్చ జరుగుతుంది. పిఠాపురం నియోజకవర్గంలో కూటమిలో ఉంటున్న టీడీపీ నేత చేతిలో ఉన్న హోంశాఖపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంశాఖను సరిగా నిర్వహించడంలేదంటూ మండిపడ్డారు. వంగలపూడి అనిత నుంచి తాను హోంశాఖను తీసుకుంటే పరిస్థితులు వేరుగా ఉంటాయని హెచ్చరికలు కూడా జారీ చేశారు. పోలీసు ఉన్నతాధికారుల నుంచి కూటమి పార్టీల నేతల వరకూ పిఠాపురంలో పవన్ కల్యాణ్ ఏకిపారేశారు. నిజానికి పవన్ కల్యాణ్ కు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యపై అసంతృప్తి ఉంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో నేరుగా చెప్పవచ్చు. లేదంటే మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావించవచ్చు. కానీ పవన్ అలా చేయలేదు. జనం సమక్షంలో హాట్ కామెంట్స్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అసలు కూటమిలో ఏదో జరుగుతుందన్న అనుమానాలను లేవనెత్తారు. ఇక పిఠాపురం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు పర్యటించాల్సి ఉన్నప్పటికీ మరుసటి రోజు పల్నాడు ప్రాంతానికి పవన్ కల్యాణ్ చేరుకున్నారు. అక్కడ వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు సంబంధించిన సరస్వతీ పవర్ భూములను సందర్శించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అన్యాక్రాంతమైన భూముల విషయాలను పవన్ ప్రస్తావించారు. పేదల భూములను జగన్ బలవంతంగా సొంతం చేసుకున్నారంటూ మండిపడ్డారు. జగన్ సీఎం అయిన తర్వాత ఈ కంపెనీకి భూముల లీజును యాభై ఏళ్ల పాటు పొడిగించుకున్నారన్నారు. కోడెల శివప్రసాద్ ను ఫర్నిచర్ కోసం వేధించి నాటి ప్రభుత్వం చంపేసిందంటూ పల్నాడు పర్యటనలో వ్యాఖ్యానించారు. భూములు లాక్కున్న వారికి సరస్వతీ పవర్స్ లో ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనంటూ రైతుల వద్ద ఆయన డిమాండ్ చేశారు. డిప్యూటీ చీఫ్ మినిస్టర్ గా ఉన్న పవన్ కల్యాణ్ ఇలా ఆవేశంగా మాట్లాడటం.. తన, తరతమ బేధల్లేకుండా మాట్లాడుతుండటం రాజకీయంగా చర్చకు దారితీసింది.

అసలు పవన్ కల్యాణ్ మనస్సులో ఏముందన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. 2027 నాటికి తాను కీలకంగా మారాలని పవన్ భావిస్తున్నారా? అన్న అనుమానం మాత్రం కూటమి పార్టీల్లోనూ బయలుదేరింది. ఢిల్లీ నుంచి ఏదైనా సిగ్నల్స్ అందాయా? అన్న చర్చకూడా ఏపీ పాలిటిక్స్ లో జరుగుతుంది. పవన్ కల్యాణ్ ఇన్నాళ్లు మౌనంగా ఉండి, చంద్రబాబు నాయుడుపై ప్రశంసలు కురిపించి కొంచెం ఇమేజ్ తగ్గడంతో తిరిగి దానిని పొందేందుకు ప్రయత్నిస్తున్నారా? అన్న అనుమానం కూడా లేకపోలేదు. మొత్తం మీద గత రెండు రోజులుగా పవన్ కల్యాణ్ చేస్తున్న కామెంట్స్, పర్యటిస్తున్న తీరు అనేక అంశాలకు చర్చనీయాంశంగా మారింది.

### డిఫెన్స్ లో అనిత

హోంమంత్రి పదవి అంటే నిజంగా కత్తిమీద సాము వంటిది. ఎవరికైనా అంతే. ఆపదవిలో ఉన్నవారికి ఏ పార్టీలో అధికారంలో ఉన్నప్పటికీ పెద్దగా పవర్స్ ఉండవు. హోంమంత్రి అంటే కేవలం విమర్శలు చేయించుకోవడానికే ఆ పదవి చేపట్టాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రితో పాటు కీలక నేతలు హోంశాఖను హ్యాండిల్ చేస్తారు. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా కూడా ఇద్దరు మహిళ హోంమంత్రులు పనిచేశారు. మేకతోటి సుచరిత కొన్నాళ్ల పాటు హోంమంత్రిగా పనిచేయగా, తానేటి వనిత ఇంకొన్నాళ్లు పనిచేశారు. కానీ ఇద్దరు కేవలం సంతకం చేయడానికి మాత్రమే ఆ సీట్లో కూర్చునే వారు. ముఖ్య నిర్ణయాలన్నీ నాటి సీఎంవో నుంచి వచ్చేవంటారు. నిజానికి వంగలపూడి అనిత హోం మంత్రిగా బాధ్యతలను చేపట్టిన తర్వాత కొంత వరకూ యాక్టివ్ గానే ఉన్నారు. అనితకు పూర్తి స్థాయి అధికారాలు ఉండవని అందరికీ తెలుసు. పవన్ కల్యాణ్ కు కూడా తెలియంది కాదు. ప్రధానమైన పోస్టింగ్ ల విషయంలో హోంమంత్రి ప్రమేయం తక్కువగానే ఉంటుంది. సాంకేతికంగానే ఎవరున్నా పదవిలో ఉంటారు తప్పించి..ఆ శాఖలో ముఖ్యమైన నిర్ణయాలన్నీ ముఖ్యమంత్రి తీసుకుంటుంటారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ ప్రధానమైనది కనుక ముఖ్యమంత్రి నిరంత పర్యవేక్షణలోనే హోంశాఖ ఉంటుంది. డీజీపీ స్థాయి అధికారులు కూడా ఏదైనా నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ఆమోదించిన తర్వాతనే తీసుకుంటారన్నది కాదనలేని వాస్తవం. కానీ విమర్శలకు వచ్చేసరికి హోంమంత్రి బలయిపోతుంటారు. ఇప్పుడు వంగలపూడి అనిత కూడా. నిజానికి గత కొద్దిరోజుల నుంచి ఏపీలో శాంతిభద్రతల సమస్యకు ఎలాంటి ఇబ్బంది లేకున్నా, కొన్ని చోట్ల మహిళలపై అత్యాచారాలు జరిగాయి. పిఠాపురంలోనూ ఒక యువతిపై అత్యాచారం జరిగింది. ఆ కేసులో నిందితుడిపై సరైన చర్యలు తీసుకోలేదన్నది పవన్ కల్యాణ్ ఆగ్రహంగా తెలుస్తోంది. దానికి హోంశాఖను బాధ్యులను చేస్తూ ఆయన మాట్లాడారు. హోంమంత్రి పనితీరును తప్పుపట్టే విధంగా ఆయన వ్యాఖ్యానించారు. కానీ హోం మంత్రి ఏ విషయంలోనూ ఏ నిర్ణయంలోనూ పెద్దగా ప్రమేయం ఉండదన్న విషయం పవన్ కల్యాణ్ కు తెలియంది కాదు. . పవన్ కల్యాణ్ వంగలపూడి అనితపై ఆయన నేరుగా వ్యాఖ్యలు చేశారు. అందువల్ల ఆమెకు వెనువెంటనే పదవీ గండం అనేది ఏమీ ఉండదు. ఎందుకంటే టీడీపీ నుంచి ఆమె గెలిచి చంద్రబాబు ఇచ్చిన పదవి కావడంతో ముఖ్యమంత్రికి అన్ని విషయాలు తెలుసు. వంగలపూడి అనిత తప్పు ఏమీ లేదని కూడా తెలుసు. అందుకే అనిత పదవికి వచ్చిన ఢోకా ఏమీ లేకపోయినా.. ఆమె తనపై విపక్షాలు చేస్తున్న విమర్శలకు మాత్రం సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. విపక్ష నేతలకు కూడా హోం మంత్రిత్వ శాఖపై పూర్తి స్థాయి అవగాహన ఉన్నప్పటికీ చివరకు ప్రభుత్వంపై బురద జల్లాలంటే ఈ శాఖ ఒక్కటే కనిపిస్తుంది. అందుకే హోంశాఖ ఎంత పవర్ ఫుల్ అయినదో.. అంత చికాకు తెప్పించే శాఖ అని అనితకు ఇప్పుడు అర్థమయి ఉండాలి.

# రగిలిపోతున్న వేమిరెడ్డి..!

నెల్లూరు-సూర్య వాస్తవం



ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. నెల్లూరు జిల్లా రాజకీయాల్లో గత దశాబ్దకాలంగా చక్రం తిప్పుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చేందుకు 2019లో జరిగిన ఎన్నికల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. అప్పటినుంచి వైసీపీలో కొనసాగుతూ పార్టీకి అండదండ జిల్లాలో తానే అన్నట్లు వ్యవహరిస్తూ వచ్చారు. ఫ్యాన్ పార్టీ అధికారంలో ఉండగా.. పార్టీ కార్యక్రమాలు అన్నిటికీ తనవంతు సహకారం అందించి ఆర్థికమగా అండగా నిలిచారు. అటువంటి నేతను పట్టించుకోలేదన్న విమర్శలు 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికమయ్యాయి. వాటిని నిజం చేస్తూ.. ఆయన చెప్పిన వారికి కాదని నెల్లూరు నగర ఎమ్మెల్యే టికెట్ ని.. జగన్ మరొకరికి కట్టబెట్టారు. దీంతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తీవ్ర మనస్థాపానికి గురై.. పార్టీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆర్థికంగా వెన్నుదన్ను ఉన్న వేమిరెడ్డి లాంటి నేత పార్టీలో చేరడంతో.. తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది. ఆయన చేరికతో మాజీ ఎమ్మెల్యేలు నేతలు ఆయన ఇంటికి క్యూ కట్టారు. ఘనంగా పార్టీలోకి ఆహ్వానించి కండువాలు కప్పి శుభాకాంక్షలు చెప్పారు. ఆ తర్వాత పరిస్థితుల్లో కొద్ది కొద్దిగా మార్పు వచ్చింది. పార్టీ అధికారంలోకి రాగానే కొద్దిరోజుల పాటు ఆనందంతో శుభాకాంక్షలు చెప్పిన నేతలు ఆ తర్వాత క్రమేపి ఆయనను కలవడం ఆపేశారట. తనకు కేటాయించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి.. పార్టీని అధికారంలోకి తీసుకురావడమే.. తన వంతు భావించిన ఆయన.. ఇప్పుడు వ్యాపారాలలో కాస్త బిజీ అయ్యారట. అయితే ఇప్పుడు నేతల తీరులో కూడా మార్పు వచ్చిందని.. వేమిరెడ్డిని పట్టించుకునే నేతలే కరువయ్యారని జోరుగా చర్చ జరుగుతుందట. రీసెంట్ గా జరిగిన నెల్లూరు డీఆర్సీ సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఘోర అవమానం జరిగింది. మండలి సమావేశంలో ఇంచార్జిగా వ్యవహరించిన రూరల్ ఆర్డీవో అనూష.. అక్కడికి వచ్చిన వారి పేర్లన్నీ చదివి ఎంపీ వేమిరెడ్డి పేరును మాత్రం విస్మరించారట. పేరు పిలవకపోవడమే కాకుండా, బొకే కూడా ఇవ్వలేదని వేమిరెడ్డి అలిగారు. దీంతో ఆయన తన భార్య, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని తీసుకుని వేదికపై నుంచి వెళ్లిపోయారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మంత్రి నారాయణ కూడా అదే వేదికపై ఉన్నారు. వేమిరెడ్డి హఠాత్తుగా లేచి వెళ్లిపోతుండటంతో ఆయన కారు వరకు వెళ్లి మంత్రి ఆనం సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఆ తర్వాత తన వెంట వచ్చిన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని.. సమావేశంలో పాల్గొనాలని చెప్పడంతో ఆమె మీటింగ్ లో పాల్గొన్నారు. నేను మటుకు ఇక రాను అని వేమిరెడ్డి సీరియస్ గా అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే మంత్రులకు పూల బొకేలు అందించి స్వాగతాలు పలికిన అధికారులు.. ఎంపీ వేమిరెడ్డిని ఎందుకు విస్మరించారో ఇప్పటికీ అంతుపట్టని పరిస్థితి నేతల్లో నెలకొంది. ఈ వ్యవహారం చూస్తే పార్టీ అధికారంలోకి వచ్చేందుకు.. వేమిరెడ్డిని వాడుకున్న నేతలు ఇప్పుడు ఆయనను దూరం పెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి.



నాడు వైసీపీలో చక్రం తిప్పిన నేత.. ప్రస్తుతం ఉన్న పార్టీ నేతలకు రుచించలేదా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే ఇంత మార్పు వచ్చి అవమానపడేలా నేతలు, అధికారులు ఎందుకు వ్యవహరిస్తున్నారు.. అసలు ఆయన వెనుక ఏం జరుగుతుంది అన్న విషయంపై జిల్లాలో జోరుగా చర్చ జరుగుతుంది. తెలుగుదేశం పార్టీకి ఆర్థిక పరిపుష్టిని ఇచ్చిన వేమిరెడ్డి లాంటి సీనియర్ నేత పార్టీలో కొనసాగే పరిస్థితి ఉంటుందా అని కూడా పొలిటికల్ వర్గాల్లో చరచర జరుగుతోంది. ఎన్నికల ముందు తన భార్య ప్రశాంతి రెడ్డికి టికెట్ అడిగితే జగన్ ఏవేవో సాకులు చెప్పి పట్టించుకోలేదట. అంతే కాకుండా వేమిరెడ్డిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినా.. ఆయన పరిధిలో ఉండే నెల్లూరు సిటీ స్థానంలో ఓ జూనియర్ నేతకు టికెట్ ఇచ్చేశారు. దీంతో అలిగిన వేమిరెడ్డి వైసీపీని వీడి టీడీపీలోకి వెళ్లి అదే నెల్లూరు ఎంపీగా గెలవడంతో పాటు తన భార్యను కోవూరులో గెలిపించుకున్నారు. దీంతో వేమిరెడ్డి అలక, చరిత్ర తెలిసిన వారెవరూ ఆయనతో పెట్టుకోరని ఆయన అభిమానులు చెబుతున్నారట. ఏదేమైనా ఎంపీ వేమిరెడ్డి ఎన్నికలకు వైసీపీలో అవమానాలను ఎదుర్కొన్న వేమిరెడ్డి.. ఇప్పుడు టీడీపీలో కూడా అవమానాలకు గురవుతున్నారని చర్చ జరుగుతోంది. ఈ ఊహాగణాలకు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఎలా చెక్ పెడతారు ? అవమానాలతోనే వేమిరెడ్డి పార్టీలో కొనసాగుతారా ? వేమిరెడ్డి భవిష్యత్తు కార్యాచరణ ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# బ్రాహ్మణులను అవమాన పరుస్తున్న టీడీపీ



**కమలాపురం - సూర్య వాస్తవం:** రాష్ట్రంలోని అధికార తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణులకు తీరని అన్యాయం చేసి అవమాన పరుస్తోందని వైసీపీ రాష్ట్ర నాయకుడు కాశీ భట్ల సత్య సాయినాథ్ శర్మ తెలుగుదేశం పార్టీ పై ధ్వజం ఎత్తారు. కమలాపురం లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్రం లో అధికారం లోకి వస్తే బ్రాహ్మణ సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని ఆయన తుంగలో తొక్కారన్నారు. రాష్ట్రంలోని దేవాలయాల కమిటీలలో బ్రాహ్మణులకు స్థానం కల్పిస్తానని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించినప్పటికీ ఆచరణలో అమలు చేయలేకపోవడం బ్రాహ్మణులపై ఆయనకున్న కపట ప్రేమకు నిదర్శనం అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థాన బోర్డు మెంబర్లలో తెలుగుదేశం పార్టీ తరఫున ఒక బ్రాహ్మణుడికి కూడా స్థానం కల్పించక రాష్ట్రంలోని యావత్ బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని అవమానపరిచారన్నారు. టీటీడీ బోర్డులో బ్రాహ్మణులకు స్థానం దక్కుతుందని అనేకమంది రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ నాయకులు ఆశించారని అయితే బోర్డు నియామకంలో బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని ఏమాత్రం పరిగణలోకి తీసుకోకపోవడంతో రాష్ట్రంలోని బ్రాహ్మణ సామాజిక వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోందన్నారు. టీటీడీ బోర్డులో మొత్తం 29 మంది మెంబర్లను నియమించినప్పటికీ తెలుగుదేశం పార్టీ ఒక బ్రాహ్మణుడికి కూడా అవకాశం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. అలాగే రాష్ట్రంలో 21 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి నప్పటికీ తెలుగుదేశం పార్టీ తరఫున ఒక బ్రాహ్మణునికి కూడా కార్పొరేషన్ లో స్థానం కల్పించకపోవడం చంద్రబాబు నాయుడు బ్రాహ్మణుడ పట్ల తీవ్ర వివక్ష చూపుతున్నారని అర్థమవుతోందన్నారు. 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని తెలుగుదేశం పార్టీ విజయం కోసం వాడుకున్న చంద్రబాబు నాయుడు అధికారం వచ్చిన తర్వాత బ్రాహ్మణుల పట్ల చిన్నచూపు చూస్తుండడం భావ్యం కాదన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్ష స్థానంలో గత ఐదు సంవత్సరాలుగా తాను వైసిపి పై పోరాటం చేసినప్పటికీ తెలుగుదేశం పార్టీలో బ్రాహ్మణులకు ఎటువంటి న్యాయం జరగదనే ఉద్దేశంతో ఎన్నికలకు చివరలో తాను వైసీపీలో చేరానన్నారు. బ్రాహ్మణుల పట్ల విశ్వాసం కలిగిన జగన్మోహన్ రెడ్డి వెంట రాష్ట్రంలోని బ్రాహ్మణులు నడవాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రాహ్మణ కార్పొరేషన్ కు నిధులు కేటాయింపు చేసి బ్రాహ్మణులను ఆర్థికంగా ఆదుకుంటామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఈరోజు వరకు బ్రాహ్మణ కార్పొరేషన్ కు కమిటీని సైతం నియామకం చేయకపోవడం బ్రాహ్మణులకు అన్యాయం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. బ్రాహ్మణుల పట్ల వివక్ష చూపుతున్న తెలుగుదేశం పార్టీని బ్రాహ్మణులందరూ విడనాడాలన్నారు. ఎంతోమంది రాష్ట్రంలోని బ్రాహ్మణులు బ్రాహ్మణ సంఘాల నాయకులు ఎన్నో ఎన్నెన్నో ఆశలతో ఆశయాలతో చంద్రబాబు నాయుడు కు మద్దతు పలికారని అయితే వారి ఆశల ను ముఖ్యమంత్రి అడియాసలు చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికైనా తాను ఇచ్చిన మాట మేరకు టీటీడీ బోర్డులో తెలుగుదేశం పార్టీ తరఫున ఒక బ్రాహ్మణుడికైనా స్థానం కల్పించాలని కోరారు.

# వేరుశనగ విత్తనాల పంపిణీ

**- కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ**



**దువ్వూరు - సూర్య వాస్తవం:** కృషి విజ్ఞాన కేంద్రం, వనిపెంట లో సామూహిక ప్రథమశ్రేణి ప్రదర్శనలో భాగంగా నూనెగింజలలో వేరుశనగ రకం కె-1812 విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. బుధవారం వనిపెంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కెవికె అధిపతి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ వేరుశనగ పంట శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేరుశనగ పంటలో విత్తన శుద్ధి ప్రాముఖ్యత, విత్తన మోతాదు, విత్తే దూరం, సమగ్ర పోషక యాజమాన్యం, నేల తయారీ విధానం, సూక్ష్మ పోషక యాజమాన్యం, కలుపు యాజమాన్యం గురించి రైతులకు ఆవగాహన కల్పించారు. విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల ఒక నెల రోజుల వరకు పురుగు. నుండి కాపాడుకోవచ్చని తెలియచేశారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. శ్రీవిద్య రాణి మాట్లాడుతూ వేరుశనగలో చేపట్టే సమగ్ర పురుగుల, తెగుళ్ళ యాజమాన్యం గురించి వివరించారు. అంతర పంటలు మరియు ఎర పంటలు వేసుకోవాలని తెలియచేశారు. వేరుశనగ విత్తనాలను దువ్వూరు మండలం, బి. మఠం మండలాలలోని. నీలాపురం, మదిరేపల్లె, చిన్నసింగిన పల్లె, పలుగు రాళ్లపల్లె, సోమిరెడ్డి పల్లె గ్రామ రైతులకు 44 మంది రైతులకు వేరుశనగ విత్తనాలను ఒక ఎకరాకు అందివ్వడం జరిగింది. పంట కాలవ్యవధిలో క్షేత్ర ప్రదర్శనలు చేసి తగు సూచనలను, సలహాలను రైతులకు అందిస్తాము అని తెలియచేశారు. కార్యక్రమంలో కె వి కె సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

**- మండల టిడిపి నాయకుడు శ్రీధర్ రెడ్డి**



**వీరబల్లి - సూర్యవాస్తవం:** వైసిపి పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలోకి వలసలు వస్తున్నారని పాలన పట్ల, నేతల తీరు పట్ల విసుగు చెంది టిడిపి పార్టీలోకి వస్తున్నారని మండల టిడిపి నాయకుడు తాటిగుట్ల శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కొంత మంది అవగాహన లేకుండ పదవులు కాపాడుకునేందుకే టిడిపి పార్టీలోకి వస్తున్నారనే ప్రచారం చేసుకోవడంలో వాస్తవం లేదన్నారు. వారికి పదవులు కొత్త ఏమి కాదని, పేరు ప్రఖ్యాతలు ఉన్న ఉన్న నాయకులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు సమిష్టిగా కృషి చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆదరణ చూసి రాష్ట్రంలో వలసలు మొదలు అయ్యాయని రాష్ట్రాన్ని కాపాడుకోవాలని ఆలోచన ఉన్న వారందరని పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు. మండలంలోని వైసిపి నేతలు మరికొందరు కూడ టిడిపిలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. మండలంలోని సీనియర్ నేతలు, కార్య కర్తలను కలుపుకొని వారి సూచనలతో మండలం అంతా పసుపు మయం చేస్తామని అన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు మానుకొని మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

### జొన్న మొక్కజొన్నలో కత్తెర పురుగు

# సమగ్ర సస్య రక్షణతో నివారణ




**దువ్వూరు - సూర్య వాస్తవం:** జొన్న మొక్కజొన్న పంటలలో కత్తెర పురుగు సమగ్ర సస్యరక్షణతో నివారణ చేయవచ్చునని మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పొలం పిలుస్తోందిలో భాగంగా మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం జొన్న, మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఆశించి ఉన్నదని వాటి నివారణకు మొదటి దశలో 5 ఎంఎల్ ఒక లీటర్ నీటికి వేప నూనె (10000 పిపియం) ను పైరు పై పిచికారి చేయవలెను, దీనివలన పురుగు గుడ్లు మునిగిపోవును, ఎకరాకు 6 నుంచి 8 లింగాకర్షణ బుట్టలు పురుగు ఉధృతిని గుర్తించవచ్చు కత్తెర పురుగు లోపల పగలంతా దాచుకొని రాత్రి సమయాల్లో ఆకులు గోకి తిని బొక్కలు వేస్తుంది, ఇలా పురుగును గుర్తించినట్లయితే ఆకుల సుడిలలో ఒకటి గాని రెండు గాని గుళికలు వేయవలెను ఇలా వారం వ్యవధిలో రెండుసార్లు చేస్తే పురుగు నివారణ చేయొచ్చు, ప్రభుత్వ పథకాలు రైతు సేవ కేంద్రాల్లో అందుతున్న సేవలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మనోజ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# కడప ఎస్పీపై ప్రభుత్వం ఆగ్రహం



**కడప బ్యూరో - సూర్యవాస్తవం:** కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజును ప్రభుత్వం బదిలీ చేసింది. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్ర రెడ్డిపై చర్యలు తీసుకోకపోవడంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనితపై రవీంద్ర రెడ్డి అసభ్యకర కామెంట్స్ చేయడంతో నిన్న రాత్రి రవీంద్ర రెడ్డిని అరెస్టు చేశారు. 41సి నోటీసులు ఇచ్చి వదిలేశారు. ఇదే కేసులో మరో సీఐని ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

**కడపకు కర్నూలు రేంజ్ డీఐజీ.. అంతలోనే ఎస్పీ బదిలీ :** గత రాత్రి నుంచి కడపలో జరుగుతున్న పరిస్థితుల నేపథ్యంలో కర్నూల్ రేంజ్ డిఐజీ కొల్లి ప్రవీణ్ కడప చేరుకున్నారు. కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయానికి ఆయన చేరుకుని జిల్లాలోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత రాత్రి వైసీపీ సోషల్ మీడియా నాయకుడు రవీందర్ రెడ్డి అరెస్ట్, తప్పించుకుపోయిన ఘటనపై ఆయన సమీక్ష చేశారు. ఇంతలోనే ఎస్పీని బదిలీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం కలకలం రేపింది.

# హీరో కిరణ్ అబ్బవరంను సన్మానించిన వీఆర్డీఎస్ సురేంద్రారెడ్డి



**వీరబల్లి - సూర్య వాస్తవం:** క మూవీ విజయోత్సవ యాత్రలో భాగంగా హీరో "కిరణ్ అబ్బవరం"సొంత ఊరు రాయచోటికి వచ్చిన సందర్భంగా ఆయన్ని కలసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతు సినిమా ఇండస్ట్రిలో మంచి పేరు, ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. హీరో కిరణ్ క సినిమాతో ఒక భారీ సక్సెస్ ని తన ఖాతాలోనే వేసుకోవడమే కాకుండా ఇండస్ట్రిలో స్టార్ హీరోలకు దీటుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారని తెలిపారు.కేవలం వారసులకు మాత్రమే పట్టం కట్టే పరిశ్రమలో తిరుగులేని పతాకంలా ఎగరడం అంటే మాములు విషియం కాదని అన్నమయ్య జిల్లాలోని యువత కిరణ్ ను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. గత ఐదు ఏళ్లుగా సినీ రంగంలో విజయవంతమైన నటుడిగా ఏదిగారని పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో కిషోర్ కుమార్ రెడ్డి, జ్ఞానేంద్ర రెడ్డి,దేవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'పొలం పిలుస్తోంది'



**చింతకొమ్మదిన్నె - సూర్య వాస్తవం:** మండలంలోని బుగ్గలపల్లి, ఇప్పపెంట గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం వ్యవసాయ అధికారులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కడప శంకర్ నాయిక్ చీని, నిమ్మ తోట, అరటి తోటలలో పరిశీలించి సస్యరక్షణ చర్యలు గురించి, సంఘాలుగా ఏర్పడితే దాని యొక్క లాభాలు గురించి, పంట బీమా గురించి రైతులకు తెలియజేయడమైనది. మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి గారు బోర్లు ఉన్న రైతులు డ్రిప్పు స్ప్రింగ్ కలర్లు రాయితీ మీద పెట్టుకోవచ్చని రైతులకు తెలియజేశారు. డ్రిప్పు 5 ఎకరాలు లోపు ఉన్న రైతులకు 90% సబ్సిడీ 5 కన్నా ఎక్కువ ఎకరాలు ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీ, స్ప్రింక్లర్లు 50% రాయితీ మీద ఇవ్వడం జరుగుతుంది. కావలసినవారు రైతు సేవ కేంద్రం లో నమోదు చేసుకోవాల్సినదిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఈశ్వర్ రెడ్డి, ఉద్యాన అధికారి జ్యోతిర్మయి, లు శిల్పా, రేఖ, రైతులు పాల్గొన్నారు.

# గ్రామసభలతో భూ సమస్యల పరిష్కారం

**- తహాశీల్దార్ అక్బల్ బాషా**




**దువ్వూరు - సూర్య వాస్తవం:** గ్రామ సభల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చునని మండల తహసిల్దార్ అక్బల్ భాష పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నేలటూరు గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి భూ సమస్యలు ఉన్న వారి నుండి అర్జీలను రెవెన్యూ సిబ్బంది స్వీకరించారు. ఈ సందర్భంగా అక్బల్ భాష మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రీ సర్వేలో తప్పులను,జాయింట్ నెంబర్లను, మీ భూమి దగ్గరికి రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ కలిసి వెళ్లి మీ సమస్యలను తీరుస్తారని ఆయన తెలియజేశారు. గ్రామ సభ గురువారం కూడా నిర్వహిస్తామని అన్నారు. సర్పంచ్ పోలిమేర శారద మాట్లాడుతూ చాలా రోజుల నుంచి పరిష్కారం కాని భూ సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరించి ప్రజలకు, రైతులకు న్యాయం చేయాలని ఆమె తహశీల్దారును కోరారు. గ్రామంలో అందుబాటులో లేనటువంటి ప్రజలు నేడు గురువారం కూడా వచ్చి అర్జీలు సమర్పించవచ్చునని భూ రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ కరీముల్లా తెలియజేశారు. మండల సర్వేయర్ పద్మావతి, గ్రామ సర్వేయర్, విఆర్ఓ సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పొలిమేర రవీంద్ర రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకోవాలి

**- మండల అధ్యక్షుడు భానుగోపాల్ రాజు**



**వీరబల్లి - సూర్య వాస్తవం:** ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం నమోదు చేసుకోవాలని వీరబల్లి మండల తెలుగుదేశం అధ్యక్షులు భానుగోపాల్ రాజు తెలిపారు రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వీరబల్లి మండల టిడిపి అధ్యక్షుడు భానుగోపాలరాజు నిర్వహించడం జరిగినది. వీరబల్లి మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసి వీరబల్లి మండలంలోని అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయాలని ప్రతి ఒక్కరిని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేంద్రారెడ్డి, ప్రతాప్ రెడ్డి. మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, గ్రామ కమిటీ భాస్కర్ రాజు. శివకుమార్ నాయుడు, రాజరాజు, మాజీ సర్పంచ్ మల్లికార్జున, సీతారామరాజు, సిద్దిరాజు, రవిరాజు, లక్ష్మి రెడ్డి, రెడ్డయ్య రాజు, సాయిరాం రాజు, రమణ, వినయ్, శివ, రామ కృష్ణంరాజు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# కడప జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తా

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



**కడప బ్యూరో – సూర్యవాస్తవం:** జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో, ప్రజల అభిమానంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు, కృషి చేస్తామని వైస్సార్ జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కు చేరుకున్న ఆయనను, కలెక్టర్ ఛాంబర్లో వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలను స్వీకరించారు. అనంతరం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.

# ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా మాధవీ లత



**సిద్ధవటం – సూర్యవాస్తవం:** సిద్దవటం ఇంచార్జి తహసిల్దార్ గా మాధవి లత బుధవారం బాధ్యతలు చేపట్టారు. సిద్దవటం తహసీల్దార్ గా పనిచేసిన మురాషావలి అక్టోబర్ 31 న పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సిద్దవటం తహసీల్దార్ పోస్టు ఖాళీ ఉండడంతో పరిపాలన సౌలభ్యం కోసం సిద్దవటం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న మాధవి లత కు ఇంచార్జి తహసీల్దార్ గా నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దవటం మండల పరిధిలో విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు కులం ధ్రువీకరణ, ఆదాయ, ఈడబ్ల్యూఎస్ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు నిర్ణీత సమయంలో అందజేస్తామన్నారు. విఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆమె సూచించారు.

# బాల కార్మికుల చట్టంపై అవగాహన



**దువ్వూరు – సూర్య వాస్తవం:** బాల కార్మికుల చట్టం పై జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ జి. సునీత అవగాహన కల్పించారు. బుధవారం మహిళా అభివృద్ధి,శిశు సంక్షేమ, సాధికార అధికారి కడప వారి ఆదేశముల మేరకు పెన్నా నగర్, ప్రొద్దుటూరు పట్టణం నందు ఉన్నటువంటి ఇటుకల కర్మాగారాలు, బీరువాలు తయారు చేయు కర్మాగారాలు యందు బాల కార్మికులు గుర్తించుటకు బాల కార్మిక డ్రైవర్ చేపట్టడం జరిగింది. అక్కడ పని చేస్తున్న సిబ్బందికి మిషన్ వాత్సల్య పథకం అందిస్తున్న సేవలు, చదువు యొక్క ప్రాముఖ్యత గురించి సునీత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కర్మాగారంలో పనిచేస్తున్న సిబ్బంది,మహిళా పోలీసులు సౌజన్య, భగీరథి, తులసి పాల్గొన్నారు.

# టెంపో ఢీకొని లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు



**మదనపల్లె క్రైమ్ – సూర్య వాస్తవం:** ములకలచెరువు వద్ద మంగళవారం రాత్రి టెంపో ఢీకొనడంతో తంబళ్లపల్లె లైన్మెన్ తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. రోడ్డు ప్రకమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. ములకలచెరువు మండలం వేపూరు కోట పంచాయితీ, రెడ్డివారిపల్లికి చెందిన బి. అప్పిరెడ్డి (52) తంబళ్లపల్లె ట్రాన్స్కో విభాగంలో లైన్మెన్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం సాయంత్రం 6:30 గంటల వరకు విధులు నిలవర్తించారు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చేందుకు బైకుపై స్వగ్రామానికి బయలుదేరి వస్తుండగా, మార్గ మధ్యంలోని దేవలచెరువు వద్ద టెంపో బైకును ఢీకొనడంతో కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి క్షతగాత్రున్ని చికిత్సల కోసం హుటా హుటిన మదనపల్లెకి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించి అక్కడి నుంచి రుయాకు రెఫర్ చేశారు. ప్రమాదానికి కారణమైన టెంపో వెళ్లిపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో రైతులకు తీవ్ర గాయాలు



**మదనపల్లె క్రైమ్ – సూర్య వాస్తవం:** కురబలకోట మండలం లోని తెట్టులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు రైతులు తీవ్రంగ గాయ పడ్డట్లు బుధవారం ముదివేడు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలం లోని తెట్టు గ్రామం, పులుసు గుంతలకు చెందిన రైతు రాము(52), అదే పంచాయతీ తెట్టుకు చెందిన మరో రైతు అదేప్ప (60) ఇవాళ ఉదయం బైకుపై కురబలకోట మండలంలోని అంగళ్లకు వెళుతూ.. మార్గమధ్యంలోని మండెంవారిపల్లె గంగమ్మ గుడి వద్ద ఎదు రెదురు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడగా, చికిత్సల నిమిత్తం వారిని 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు ఇద్దరికీ మెరుగైన వైద్య చికిత్సలు అందించి వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు రిఫర్ చేశారు. కుటుంబీకులు వారిని వెంటనే తిరుపతికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# భూమిరెడ్డి రవికళ్యాణ్‌కు అవార్డుతో సత్కారం









**మైదుకూరు – సూర్య వాస్తవం:** రక్తదాన సేవలను గుర్తించి భూమిరెడ్డి రవికళ్యాణ్ కు బ్లడ్ హీరో అవార్డుతో ఘనంగా సత్కారం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ బ్లడ్ డోనార్ ఆర్గనైజేషన్స్ సహకారంతో ఖూన్ కా రిస్టా ఎన్జీఓ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ బ్లడ్ డోనర్స్ మధ్య కడప కలెక్టర్ కార్యాలయం డిఆర్డిఏ నందు భూమిరెడ్డి రవికళ్యాణ్ కుసన్మానం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ బ్లడ్ డోనార్ ఆర్గనైజేషన్స్ సహకారంతో ఖూన్ కా రిస్టా ఎన్జీఓ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ బ్లడ్ డోనర్స్ మధ్య కడప కలెక్టర్ కార్యాలయం నందు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ జాన్ సెక్రటరీ భూమిరెడ్డి రవికళ్యాణ్ కు ముఖ్య అతిథుల మధ్య సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదా భరతమాత సేవలో నిరంతర సేవా కార్యక్రమాలు చేపడుతూ 23 సార్లు బ్లడ్ డొనేషన్ చేసి మోటివేషన్ ల ద్వారా చాలామందికి బ్లడ్ సహాయం చేయడానికి ఏర్పాటు చేయడం జరిగిందని రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యకరంగా ఉంటూ రక్తదానం చేస్తూ ఇతరుల ప్రాణాలు కాపాడుతూ వారికి పునర్జన్మ కలిగించిన వారమవుతామని అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదని వాటిని డబ్బుతో కొనలేమని అన్ని బంధాల కన్నా రక్త బంధం ఎంతో గొప్పదని తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ బ్లడ్ డోనార్ ఆర్గనైజేషన్స్ సహకారంతో ఖూన్ కా రిస్టా ఎన్జీఓ ఆధ్వర్యంలో డి ఆర్ డి ఎ మీటింగ్ హాక్ , కడప కలక్టరెట్ నందు రక్తదాన శిబిరాల ఆవశ్యకత మీద ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి 100 మంది ఎన్జీఓ లు స్వచ్ఛంద సేవకులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫెరిడేషన్ ఆఫ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ మాజీ జాతీయ అధ్యక్షుడు కె.పి రాజా గోపాలన్, ఫెరిడేషన్ ఆఫ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ జాతీయ అధ్యక్షుడు పాలకమండల్ సభ్యుడు బిశ్వరూప్ విశ్వాస్, ఫెరిడేషన్ ఆఫ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ రాష్ట్ర ప్రెసిడెంట్ నేషనల్ ఎద్యుకేట్ కమిటీ సభ్యుడు దేవ ప్రియదర్, శివస్య వేమం, సంతోష్ చలికార్, పుష్యమిత్ర, మైనతుల్ల, ఎం. తారీక్ ఆలీ, ప్రతినిధులుపిద్దో ప్రతినిధులు తిరుపతి డాక్టర్ రవికుమార్, తిరుపతి డాక్టర్ ప్రవీణ్, నెల్లూరు డాక్టర్ యశోవర్ధన్, కడప డాక్టర్ రాజేంద్ర, కడప డాక్టర్ సంధ్య, తిరుపతి డాక్టర్ సురేష్, పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త కేంద్రాలకు సంబంధించిన మార్పులు డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ విషయాలపై అవగాహన ఆదర్శవంతమైన సేవలు రక్తమార్పిడి, స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ఎటువంటి గాథలను ఎన్నుకోవాలో రక్తదానం ఎంపిక ప్రమాణాలు పత్తదాతల ఉంది విరాళాలు పోస్ట్ డొనేషన్ కౌంటింగ్ రక్తదానం హ్యాపీ రిసిస్ ప్రక్రియ పచ్చిపుల దాత పతి చర్యలు రక్తదానం నాణ్యత ప్రోత్సహించడంలో రక్త కేంద్రాలు స్వచ్ఛంద సేవకుల పాత్ర వంటి వివిధ విషయాలపై పూర్తిస్థాయి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. వచ్చిన స్వచ్ఛంద సేవకులకు ఎన్జీవోస్కు వారి సేవలను అభినందిస్తూ ప్రతి సామాజిక అంశంలో మీ భాగస్వామ్యానికి మేము హృదయపూర్వకంగా ధన్యవాదాలుతెలియజేస్తున్నాము, హద్దులు, నిస్వార్థత లేకుండా మానవత్వం చర్యలో ఉండటం చాలా గొప్ప విషయం. తోటి పౌరులకు సేవ చేయడం గొప్ప సంతృప్తిని కలిగించినప్పటికీ, సేవ యొక్క చేదు సత్యాన్ని బహిర్గతం చేయడం చాలా బాధాకరమైనది అయినప్పటికీ, మా సమాజ అవసరాలకు శ్రద్ధ మరియు మద్దతు ఇవ్వడం, మీ సహకారం ఈ సమాజానికి గణనీయమైన మార్పును కలిగించే ఉద్దేశ్యంతో అందించబడింది. మరియు మానవత్వం ఇప్పటికీ ఉనికిలో ఉంది అనే వాస్తవాన్ని సమీక్షించండి, మన ప్రియమైన మానవతా వ్యక్తిత్వం తన జీవితంలో ప్రచారం చేసి ఆచరించింది అభినందిస్తూ బ్లడ్ హీరో అవార్డుతో శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మీకోసం సేవా సంస్థ విష్ణు, అమ్మ సేవా సమితి శివశంకర్, నేస్తం సేవాసమితి కొండారెడ్డి, వినాయక ఫౌండేషన్, కేర్ క్లబ్, వీరబ్రహ్మేంద్ర సేవ మాలకొండయ్య, మదర్ తెరిసా ఫౌండేషన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభించాలి

**- పోన్నవోలు రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ**
**- బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ**





సిద్దవటం – సూర్యవాస్తవం: ప్రతి రైతులు పర్యావరణ హిత ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ పిలుపు నిచ్చారు. సిద్దవటం మండలంలోని జ్యోతి రైతు సేవా కేంద్రంలోని జ్యోతి, పొన్నవోలు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట కోత దశలో ఉందని, కోత అనంతరం తిరిగి రబీ సీజన్ లో వరి, నువ్వులు సాగుచేస్తామని రైతులు తెలిపారన్నారు. పొన్నవోలు గ్రామంలోని గంగమ్మ గుడీ దగ్గర రూపురెడ్డి ఎల్లారెడ్డి, సురేంద్ర రెడ్డి సాగు చేసిన వర్ (ఎన్.డి.ఎల్.ఆర్ – రకం) పూత దశలో ఉందన్నారు. పాము పొడ తెగులు, కాండం తొలుచు పురుగు ఆశించిందన్నారు. దీని నివారణకు ఫేమ్ ఎకరాకు 60 మిల్లీ లీటర్లుం షీత్ మార్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వరినారు పోసే సమయంలో సూడో మొనస్ ఫ్లోరిసెన్స్ బ్యాక్టీరియా జీవ సంబంధ తెగుళ్ళ మందుతో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు తదితర తెగుళ్లను నివారించవచ్చునన్నారు. జిగురు పూసిన పసుపు తెలుపు నీలం పల్లాలు రసం పీల్చు పురుగుల నివారణకు విరివిగా వాడాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు లింకాకర్శక బుట్టలు అమర్చాలన్నారు. వరిలో కాండం తొలుచు పురుగును గమనించడం జరిగిందన్నారు. కోరాజన్ అనే పురుగు మందును ఎకరాకు 50 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారి చేయాలన్నారు. వరి నాటే సమయంలో కొనలు తుంచి నాటడం, కాలి బాటలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను కూడా వివరించి ప్రతి రైతు పర్యావరణ హిత ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలని సూచించారు. అనంతరం పొన్నవోలు రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్ లను పరిశీలించడం జరిగిందన్నారు. రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు వివరించటం జరిగిందన్నారు. యూరియా, పోటాష్ 28:28:0, డిఏపి వంటి ఎరువులను డిసెంబర్ మొదటి వారం నుండి రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించామన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు, పెరటి తోటల పెంపకం, వ్యవసాయ అనుబంధ శాఖల కార్యక్రమాలను వివరించటం జరిగిందన్నారు. పంట మార్పిడితో తెగుళ్ళు, పురుగుల ఉధృతిని తగ్గించవచ్చునన్నారు. డ్రం సీడర్ వరి, డ్రోన్ తో పిచికారి వంటి సాంకేతిక అంశాలను ఉత్తమ యాజమాన్య పద్ధతులను పిలుస్తోంది కార్యక్రమంలో వివరించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర ఉద్యాన సహాయకులు హసనాపురం శ్రీనాథ్, మండల వ్యవసాయ అధికారి కే రమేష్ రెడ్డి, రైతులు జ్యోతి రామ సుబ్బారెడ్డి, బూసి లక్ష్మీ రెడ్డి, బూసి వెంకట సుబ్బారెడ్డి, మన్యం నాగార్జున నాయుడు, ఊంచ నాగేంద్ర, జ్యోతి శేషారెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

# విషం తాగిన యువతి



**మదనపల్లె క్రైమ్ – సూర్య వాస్తవం:** ప్రేమించి పెళ్లి చేసుకోవాలను కుంటున్న తమను పెద్దలు విడదీస్తున్నారని ఓ యువతి ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఘటనపై ఒకటవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె బెంగళూరు రోడ్డు, నక్కలదిన్నెలో ఉండే నగీన(22) మదనపల్లె రీడింగ్ రూమ్ వీధిలో ఓ బట్టల షాపులో పనిచేస్తోంది. తనతో పాటు బట్టల దుకాణంలో పనిచేసే అబ్దుల్ రజాక్ ప్రేమించు కుంటున్నారు. పెళ్లి చేసుకోవాలని చూస్తే రజాక్ మామ సయ్యద్వావలి తమను విడదీసి పది మందిలో పరువు తీస్తున్నాడన్న మనస్థాపంతో ఆ యువతి ఎలుకల మందు విషం తాగింది. కుటుంబీకులు గమనించి బాధితురాలని చికిత్సల నిమిత్తం హుటాహుటిన మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి ఆ యువతీ పరిస్థితి విషమించడంతో వెంటనే తిరుపతికి వెళ్లాలని డాక్టర్లు రెఫర్ చేశారు. కుటుంబీకులు బాధితురాలను వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రకాశం జిల్లా వాసి మదనపల్లెలో మృతి



**మదనపల్లె క్రైమ్ – సూర్య వాస్తవం:** ప్రకాశం జిల్లా వాసి మదనపల్లెలో మృతి చెందినట్లు బుధవారం ఉదయం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రామచంద్ర తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా, సింగరాయ కొండలోని సెల్ టవర్ వీధిలో కాపురం ఉండే షేక్ రెహమాన్ కుమారుడు షేక్ నజీర్ అహమ్మద్ (66) మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్ అవణలో చనిపోయి ఉండగా, అందిన సమాచారం మేరకు వెంటనే వెళ్లి మృతదేహాన్ని పరిశీలించా మన్నారు. మృతుని జోబిలో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా చనిపోయిన వ్యక్తి ప్రకాశం జిల్లా, సింగరాయకొండ సెల్ టవర్ వీధిలో కాపురం ఉంటున్న షేక్ నజీర్ అహ్మద్ గా గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక జిల్లా ఆసుపత్రి లోని మార్చురీకి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన బంధువులు మదనపల్లె రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ని ఆశ్రయించి మృతదేహాన్ని తీసుకు వెళ్ళవచ్చు అని చెప్పారు. వివరాలకు 9440796741 కు సంప్రదించాలని సీఐ తెలిపారు.

# టీటీడీ ఛైర్మన్‌ని కలిసిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా



**మదనపల్లె క్రైమ్ – సూర్య వాస్తవం:** తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్.నాయుడుని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా తిరుమలలో మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం టిటిడి చైర్మనుగా బి.ఆర్.నాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి స్వయంగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆ కలియుగ దైవం శ్రీవారి ఆలయం చైర్మనుగా సరైన వ్యక్తిని సీఎం చంద్రబాబు నాయుడు నియమించారని, బి.ఆర్.నాయుడు ఆధ్వర్యంలో తిరుమల దేవస్థానం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట తెలుగుదేశం నాయకులు షంషీర్, పెంచుపాడు స్వామి, రాటకొండ మధుబాబు, పూల మురళి తదితరులు ఉన్నారు.

# మద్యం తాగి కోమాలోకి వెళ్లిన యువకుడు మృతి



**మదనపల్లె క్రైమ్ – సూర్య వాస్తవం:** మద్యం తాగి కోమాలోకి వెళ్లిన వ్యక్తి మృతి చెందినట్లు బుధవారం కుటుంబీకులు తెలిపారు. కురబలకోట మండలం, ఎరిమద్ది వారిపల్లెకు చెందిన ద్వారకనాథరెడ్డి(28) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అతిగా మద్యం తాగి కొండకిందకు వెళ్లి పడుకున్నాడు. అక్కడ చీమలు శరీర భాగాలను బాగా గాయపర్చాయి. దీంతో అతను మరింత గాయపడి లేవ లేని స్థితికి చేరుకున్నాడు. మంగళవారం సాయంత్రం పశువుల కాపర్లు ద్వారకనాథరెడ్డిని గుర్తించి, కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు వచ్చి బాధితుడిని అదే ఆటోలో చికిత్స నిమిత్తం హుటాహుటిన మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి అతని పరిస్థితి విషమించడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రి నుంచి తిరుపతికి వెళ్లాలని రెఫర్ చేయడంతో, రుయాకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ద్వారకనాథరడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# జాతీయ ఉర్దూ సెమినార్ విజయవంతం చేయండి

**- జాతీయ సెమినార్ చీఫ్ ప్యాటర్న్ అమీర్ బాబు**



**కడప - సూర్యవాస్తవం ప్రతినిధి:** అంజుమన్ తరఖీ ఉర్దూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ ఉర్దూ సెమినార్ కు విజయవంతం చేయాలని సెమినార్ చీఫ్ ప్యాటర్న్ అమీర్ బాబు పిలుపునిచ్చారు. కడప నగరంలోని రహమతియ ఫంక్షన్ హాల్ లో అంజుమన్ తరఖీ ఉర్దూ సెమినార్ కమిటీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమీర్ బాబు మాట్లాడుతూ ఈ నెల 9,10 తేదీలలో ( శనివారం, ఆదివారం ) కడప నగరంలోని ఎస్ కే ఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాతీయ సమినార్ నిర్వహిస్తున్నామని ఈ సెమినార్ రాష్ట్ర మంత్రులు ఎంపీలు ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు హాజరవుతారని, కవి సమ్మేళనం, విద్యార్థులకు బహుమతులు, ఉత్తమ సేవకులకు అవార్డులు ప్రదానం చేస్తామని పెద్ద సంఖ్యలో ఉర్దూ భాషాభిమానులు, సాహితీ వ్యక్తులు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సమాజ సేవకులు హాజరు అవ్వాలని ఆయన కోరారు. అనంతరం ఇటీవల ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన జమీయత్ ఉలుమా ఏ హింద్ - వక్ఫ్ బోర్డు బహిరంగ సభలో అతిథిగా పాల్గొని వచ్చిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్ బాబుకు తెలుగుదేశం పార్టీ నగర ఉపాధ్యక్షులు పఠాన్ మన్సూర్ ఖాన్ తన మిత్రబృందం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరం ముస్లిం వ్యవస్థాపక అధ్యక్షులు కే అష్రఫ్ అలీ ఖాన్ మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా అమీర్ బాబు సమాజసేవకై అహర్నిశలు కృషి చేస్తున్నారని ,నేటి నాయకులకు ఆదర్శవంతుడని , ఆయన సేవలకు తగిన గుర్తింపుని ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడును కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నజీర్ అహ్మద్, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, అంజుమన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సత్తార్ సాహిర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్తార్ ఫైజి, సయ్యద్ హిదాయతుల్లా, కౌన్సిల్ సభ్యులు నసీరుద్దన్, సిరాజ్ బుఖారి, ఇఫ్తికార్ జమాల్, మన్సూర్ అలీ ఖాన్, సయ్యద్ రహమతుల్లా, రఫీఖ్ ఖాన్, నజీర్ బాషా, నయీమ్, మఖ్బూల్, అధ్యాపకులు డాక్టర్ ఖాజాపీర్, సర్దార్, ఇంతియాజ్, అన్వర్ హాది తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా తోడుంటాం

**- వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గడికోట శ్రీకాంత్ రెడ్డి**



**రాయచోటి - సూర్య వాస్తవం:** సమిష్టి కృషితో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రామాపురం మండలం సుద్దమల్ల గ్రామం యర్రమరెడ్డిగారిపల్లె లోని స్వగృహంలో జరిగిన రాయచోటి మున్సిపాలిటీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాజీ ఎంఎల్ఏ గడికోట మోహన్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష తో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను తయారు చేసుకుందా మన్నారు. కార్యకర్తలు, నాయకులు తనకు తోడుగా నిలిచారు. మీ మేలు మరువలేను. ఇంకా సమిష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందా మన్నారు. కార్యకర్తలు, నాయకులకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా తోడుంటానని ఆయన భరోసా నిచ్చారు.ఈ ఎన్నికలలో జరిగిన లోపాలను సరి చేసుకుందామన్నారు. రాయచోటి పట్టణ అభివృద్ధిపై అనునిత్యం కృషి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలలోనే ఏమేమి అభివృద్ధి పనులు చేయాల నుకున్నామో డిపిఆర్ లు సిద్ధం చేసి అభివృద్ధిపై దృష్టి పెట్టిన విషయాలను ఆయన వివరించారు.ఆర్.డి.ఓ కార్యాలయం ఎక్కువ అనుకున్న రాయచోటిని జిల్లా కేంద్రంచేయడం జరిగిందన్నారు. వందపడకల ఆసుపత్రి, ఆర్ టి సి బస్టాండ్ విస్తరణ, గుణ్ణికుంట్ల రోడ్, సుండుపల్లె రోడ్ విస్తరణలు, నగరవనం, డైట్ మున్సిపల్ పార్క్, రైతు బజార్, 4 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ట్రాఫిక్ పోలీసు స్టేషన్, డిఎస్పి కార్యాలయం, స్టేట్ గెస్ట్ హౌస్, అదనపు త్రాగునీటి ట్యాంక్ ల నిర్మాణం, పట్టణ సుందరీకరణ పనులు, క్రికెట్ స్టేడియం, శిల్పారాం, మున్సిపల్ సభా భవనం తదితర అభివృద్ధి పనులను ఎంతమేర అభివృద్ధి చేయాలనో అంత మేర అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. 22 పార్టీ కమిటీ పదవులను త్వరలో భర్తీ చేసుకుని, పార్టీని బలోపేతం చేయాలన్నారు. మరికొన్ని విషయాలలో కఠినంగావ్యవహరిస్తామన్నారు.ప్రాణం ఉన్నంతవరకూ రాజకీయాలను కొనసాగిస్తామని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజర్ రెహమాన్, స్టేట్ సివిల్ సప్లైస్ మాజీ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మదనపల్లె పరిశీలకులు హాబీబుల్లా ఖాన్, మైనారిటీ జిల్లా చైర్మన్ బేపారి మహమ్మద్ ఖాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందాదుల్లా, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, కౌన్సిలర్లు రౌనక్ హుస్సేన్, ఫయాజ్ అహమ్మద్, కసిరెడ్డి వెంకట నరసింహా రెడ్డి, షబ్బీర్, సాదక్ అలీ, గౌస్ ఖాన్, రియాజ్, పల్లా రమేష్, ఇర్షాద్, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బజ్జుబాబు, కో ఆప్షన్ అయ్యావారు రెడ్డి, ఇర్షాద్, ఇమ్రాన్, మహేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, చిన్న సంజీవయ్య, యువజన విభాగం అధ్యక్షుడు కొత్తపల్లె ఇంతియాజ్, నాగేంద్ర, అష్రఫ్, పొదలపల్లె గోపాల్ రెడ్డి, యూసుఫ్, అజ్మతుల్లా ఖాన్, జావీద్, అమీర్, అశోక్, నవాజ్ తదితరనాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎందుకు మాట్లాడరు

**- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్**



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం పై జిల్లా ఇన్చార్జి మంత్రి ఎందుకు మాట్లాడరని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రశ్నించారు. బుధవారం స్థానిక అనీ బిసెంట్ మున్సిపల్ హైస్కూల్ లోని స్త్రీ శక్తి భవన్ హాల్ నందు, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), సిపిఎం ప్రొద్దుటూరు పట్టణ కమిటీ 3వ మహాసభ కామ్రేడ్స్ ముంతాజ్ బేగం, పకీరయ్య ల అధ్యక్షత ప్రారంభమైంది. ఈ సందర్భంగా సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మహాసభ ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టం-2014 లో పేర్కొనబడిన విధంగా వెనుకబడిన రాయలసీమ నడి ఒడ్డున ఉన్న కడప జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన "సెయిల్ "ఆధ్వర్యంలో భారీ ఇంటిగ్రేటెడ్ ఉక్కు పరిశ్రమ నిర్మించి, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒక లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పించి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడం ద్వారా రాయలసీమలోని కరువులు, వలసలు నివారించాలని పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదంతో చట్టంలోని 13వ షెడ్యూల్లో పెట్టినప్పటికీ, అమలు చేయకుండా కేంద్రంలోని, రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు దాటి వేస్తూ, మాయ మాటలు చెబుతూ వస్తున్నాయని ఆరోపించారు. ప్రస్తుత సీ.ఎం. చంద్రబాబు గతంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఉన్నారని, ప్రస్తుతం కేంద్రంలోని అధికారంలో ఉన్న ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం, రాష్ట్రంలోని టిడిపి ఎం.పీ. సీట్లపై ఆధారపడి ఉందని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించడానికి కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇనుప ముడిఖనిజం, విద్యుత్తు, నీరు, రవాణా సౌకర్యాలు ఉన్నప్పటికీ కడప జిల్లాలో స్టీల్ ప్లాంటును నిర్మించేందుకు కృషి చేయడం ద్వారా విభజన హామీల అమలుకు టిడిపి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన కోరారు. కడప-బెంగళూరు రైల్వే లైన్ 20 సంవత్సరాలుగా 20 కి.మీ. మాత్రమే పూర్తి చేయబడిందని, మిగతా రైల్వే లైను పూర్తి చేయాలని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇద్దరూ చెరీ 50% నిధులు కలిసి విడుదల చేసి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయడానికి కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. దశాబ్దాలు గడుస్తున్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడానికి జిల్లాలలోని తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలిగొండ ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్ల పంట కాలువలు పూర్తి చేయడానికి ఈనెల నవంబర్ 11 నుండి ప్రారంభమవుతున్న రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ లో కడప జిల్లా లోని ప్రాజెక్టులకు, పెండింగ్ పనులు పూర్తికి నిధులు కేటాయించాలని, నిర్దిష్ట కాల పరిమితిలో ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కడప జిల్లాలో ఈ సంవత్సరం రుతుపవనాలు ఆలస్యంగా రావటం వల్ల అత్యల్ప వర్షపాతం 33 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయిందని, కొన్ని ప్రాంతాలలో ఇప్పటికే మంచినీరు, పశువుల మేత సమస్యగా తయారయిందని, 16 రకాల మెట్టపైర్లు ఎండిపోతున్న పరిస్థితి జిల్లాలో ఉందన్నారు. కడప జిల్లాలో కరువు మండలాలు ప్రభుత్వం ప్రకటించకపోవడం వ్యవసాయాధికారుల నిర్లక్ష్యమే కారణంగా భావించాలా, మాజీ సీ.ఎం. జిల్లా అని వివక్షత నేటి ప్రభుత్వం చూపుతోందని అర్థం చేసుకోవాలా అని వారు ప్రశ్నించారు. కే.సీ.కెనాల్ పరివాహక ప్రాంతం 8 మండలాలు మినహా, జిల్లా అంతటిని కరువు ప్రాంతంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు తక్షణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రూ.530 కోట్లతో పులివెందులలో మెడికల్ కళాశాల నిర్మించిన దానిని, మౌళిక వసతులు, ఫ్యాకల్టీ తీరు తెన్నులను పరిశీలించిన నేషనల్ మెడికల్ కౌన్సిల్, ఎన్.ఎం.పీ. 50 ఎం.బీ.బీ.ఎస్. సీట్లు కేటాయిస్తూ ఆగస్టు 5న ఉత్తర్వులు జారీ చేస్తే టిడిపి ప్రభుత్వం ఆశాస్త్రీయమైన కారణాలతో, మాజీ సీ.ఎం.పై ద్వేషంతో, వారి నియోజకవర్గం కావటం వల్ల దురుద్దేశపూర్వకంగా అండర్ టేకింగ్ లెటర్ కోరిందని, కడప జిల్లా పై కక్ష కట్టిన రాష్ట్ర సర్కార్ ధోరణి జిల్లా ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు మెడికల్ సీట్లు కోల్పోవాల్సి వచ్చిందని, ఈ ప్రాంత విద్యా లోకానికి ఇదో ద్రోహంగా ప్రజలు చూస్తున్నారని, కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్ కు మంజూరైన ఎం.ఎస్.ఎం.ఈ. టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని సీ.ఎం.అమరావతికి తరలించటం రాష్ట్ర ప్రభుత్వం చేసిన క్షమించరాని నేరమన్నారు. సీఎం కూడా రాయలసీమ వాసి అన్న విషయం మరిచిపోయారన్నారు. జిల్లా పారిశ్రామికాభివృద్ధికి ఎంతగానో దోహదపడేదని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. వివిధ ఇంజనీరింగ్ రంగాలకు సంబందిం చిన కోర్సులను ఇది అందిస్తుందని, దీని నిలుపుదల చేయడానికి, జిల్లాలోని టిడిపి 5 మంది ఎమ్మెల్యేలు, టిడిపి జిల్లా అధ్యక్షులు పోలిట్ బ్యూరో సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు. కడప జిల్లా సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయింపు 2024-25 రాష్ట్ర బడ్జెట్లో కేటాయించాలని కోరారు. అభివృద్ధి రాష్ట్రమంతటా వికేంద్రీకరణ పద్ధతుల్లో జరగాలని గుర్తు చేశారు. ముఖ్యంగా రైల్వే లైన్లు, రోడ్లు, మౌలిక సదుపాయాలు, ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు, అన్ని రకాల విద్యా, వైద్య రంగాల నిర్మాణం మరియు ఐటీ పరిశ్రమ రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో స్థానిక వనరులు పరిస్థితులు, వెనుకపాటు తనం, అనుకూలతను చూసి ఏర్పాటు చేయాలని వారు కోరారు. దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు 600 ఎకరాల భూములు ఆక్రమణపై విచారణ చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న 1813 మంది గ్రీన్ అంబాసిడర్లకు పెండింగులో ఉన్న వేతనాలు ఇవ్వాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ట్రబుల్ ఆర్ పథకం కింద నిధులు విడుదల చేయాలన్నారు. మహాసభల ప్రారంభానికి ముందు జండా ఆవిష్కరణ సిపిఎం సీనియర్ నాయకులు ఫకీరయ్య చేశారు. మహాసభల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, ప్రొద్దుటూరు పట్టణ కమిటీ సభ్యులు కే.సత్యనారాయణ, సిపిఎం శాఖా కార్యదర్శులు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

# వర్షపాత నమోదుకు సచివాలయ పరిధిని యూనిట్‌గా తీసుకోవాలి

**మైదుకూరు - సూర్య వాస్తవం:** నమోదైన వర్షపాతం నెలవారీగా భూమి లోపల ఉన్న నీటి లభ్యత ఆధారంగా, మండలాన్ని యూనిట్ గా పరిగణలోకి తీసుకొని కరువు మండలాలను ప్రకటిస్తుండడంతో రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, అలాకాకుండా వర్షపాతం నమోదుకు సచివాలయ పరిధిని యూనిట్ గా తీసుకోవాలని వైఎస్ఆర్ సీపీ నేత, ఏపీఎస్ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మైదుకూరు నియోజకవర్గం లోని ఖాజీపేట మండలం, దుంపలగట్టు గ్రామంలోని అయన స్వగృహంలో బుధవారం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మాత్రమే వర్షపాత నమోదు కేంద్రం ( రెయిన్ గేజ్ ) ఉంటుందన్నారు. మండల పరిధి భౌగోళికంగా 40, 50 కిలోమీటర్ల విస్తరించి ఉన్నందున మండల పరిధిలో చాలాచోట్ల వర్షం పడకపోయినా కేవలం మండల కేంద్రంలో వర్షం పడితే ఆ లెక్కలను పరిగణలోకి తీసుకోవడంతో రైతాంగానికి తీరని అన్యాయం



జరుగుతోందన్నారు. అలా కాకుండా గ్రామ సచివాలయాన్ని యూనిట్ గా తీసుకుంటే వాస్తవాలు ప్రతిమింబిస్తాయని తద్వారా రైతంగానికి మేలు జరుగుతుందని ఆయన సూచించారు. వైఎస్ఆర్ జిల్లాలోని కలసపాడు, కాశి నాయన, పోరుమామిళ్ల,లింగాల చక్రాయపేట, సింహాద్రిపురం, తొండూరు తదితర మండలాలు ఎప్పుడూ తక్కువ వర్షపాతం నమోదు అవుతున్నప్పటికీ జిల్లాలో ఏ ఒక్క మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులకు అన్యాయానికి గురవుతుందని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రధాని ఫసల్ బీమా యోజన ప్రీమియంను గతంలో వైయస్ జగన్ ప్రభుత్వం రైతాంగం పక్షాన చెల్లించిందని కానీ కూటమి ప్రభుత్వం ఖరీఫ్ లో చెల్లించలేదని రబీ లో రైతాంగ మే చెల్లించాలని ఆదేశించడం రైతాంగాన్ని వంచించడమే అని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైయస్ జగన్ ప్రభుత్వంలో రైతు భరోసా కింద పెట్టుబడి సాయంగా జూన్ జూలై నెలలో 13,500 చెల్లించే వారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద 20,000 ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి ఇంతవరకు అంటే రబీ సీజన్ మొదలైనా ఆ ఊసే లేదని ఆవేదన వ్యక్త పరుస్తూ.. తక్షణం పెట్టుబడి సాయం అందించాలని రెడ్యం డిమాండ్ చేశారు.

# కడప జిల్లా రైతులపై ప్రభుత్వ వైఖరి దారుణం

**మైదుకూరు - సూర్య వాస్తవం:** రాష్ట్రంలో అన్ని జిల్లాలలో కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు సహాయం ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం కడప జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా కరువు మండలం గా ప్రకటించకపోవడం చాలా అన్యాయమని వెంటనే కడప జిల్లాలో కూడా అతివృష్టి , అనావృష్టి వల్ల దెబ్బతిన్న మండలాలను పరిశీలించి వెంటనే కరువు మండలాలుగా ప్రకటించి ఆదుకోవాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏవి.రమణ, కొవ్వూరు. మస్తాన్ రావు అన్నారు. ఈరోజు కడపలో మీడియా మిత్రులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రముగా ఉన్నప్పుడు, రాష్ట్ర విడిపోయిన తర్వాత రాష్ట్రాన్ని ముఖ్యమంత్రిగా పాలించినది రాయలసీమ వాసులైన రాయలసీమను అభివృద్ధి పరిచి రాయలసీమ ప్రజలకు, రైతులకు సహాయం చేయక పోవడంతో రాయలసీమ జిల్లాలు అభివృద్ధి చెందకు వెనకబడిపోవడం జరిగిందని ఇప్పటికైనా రాష్ట్ర విడిపోయిన తర్వాత రాష్ట్రంలో రాయలసీమ



భూభాగం 40 శాతం ఉన్న రాష్ట్ర బడ్జెట్లో అన్ని విభాగాల్లో 40 శాతం వాటా కేటాయించి రాయలసీమ అభివృద్ధికి పాటుపడాలని పాలక పార్టీలను రైతు సేవా సమితి కోరుతుంది. అలాగే రైతులకు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ ప్రకారం 20 వేల రూపాయల రైతు భరోసాను వెంటనే రైతులకు చెల్లించాలి, అలాగే ప్రస్తుత ప్రభుత్వం నిధులు అన్నీ కూడా అమరావతి, పోలవరమే కాకుండా రాయలసీమ, కడప జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి , అలాగే రాయలసీమ జిల్లాల్లో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాల కొరకు ఉక్కు ఫ్యాక్టరీ, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు నిర్మించాలి పై సమస్యలపై పాలక, ప్రతిపక్ష పార్టీలు సమస్యల పరిష్కారం కోసం స్పందించకపోతే రైతు సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజా సంఘాలతో కలిసి ఆందోళనలు నిర్మిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవి.రమణ, కొవ్వూరు మస్తాన్ రావు లతోపాటు రైతు సేవా సమితి కడప నియోజకవర్గ కన్వీనర్ బలిజపల్లి శ్రీనివాసులు, సమితి జిల్లా కౌన్సిల్ సభ్యులు మూలె రామాంజనేయరెడ్డిలు పాల్గొన్నారు.

# సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పరీక్షించండి

## - జిల్లా కలెక్టర్

**చిత్తూరు - సూర్యా వాస్తవం:** జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024-25 సంవత్సరానికి మంజూరు కాబడ్డ అంతర్గత సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పరీక్షించాలని, పూర్తి అయిన పనులకు సంబంధించిన బిల్లులను సత్వరమే అప్ లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పంచాయతీ రాజ్ ఇఇ చంద్రశేఖర్ రెడ్డిని ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరంలో జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024-25 కింద చేపట్టిన పనుల పురోగతి పై పంచాయతీ రాజ్, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమం లో డ్వామా పి డి రవి కుమార్, పి ఆర్ డిఇ లు, ఏఇ లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా అంతర్గత సిమెంట్ కాంక్రీట్ రోడ్ల కు సంబంధించి 2024-25 సంవత్సరానికి గానూ 1503 పనులు మంజూరు కాబడ్డాయని, ఇందులో రూ.13 కోట్లతో 248 పనులు పూర్తి చేశామని, రూ.8 కోట్లకు సంబంధించిన బిల్లులను అప్ లోడ్ చేసి రూ.2.50 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను సత్వరం ఆన్లైన్ లో అప్ లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సిసి రోడ్డు నిర్మాణం జరిగే సమయంలో పంచాయతీరాజ్ ఇంజినీర్లు నాణ్యతను పరీక్షిస్తుండాలని, నాణ్యతాపరంగా ఖచ్చితంగా






ఉండాలన్నారు. ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ కింద చేపట్టే ఇతర పనులను విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనలు పంపాలన్నారు. ఐసిడిఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనాల నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. సిసి రోడ్ ల నిర్మాణంలో వెనుకబడిన మండలాలు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

**సిసి రోడ్ల నిర్మాణాలు:** చిత్తూరు నియోజకవర్గంలో రూ.21 లక్షలతో 6 పనులు పూర్తి కాగా, జి డి నెల్లూరు నియోజకవర్గంలో రూ.2.50 కోట్లతో 54 పనులు. పలమనేరు నియోజకవర్గంలో రూ.2.88 కోట్లతో 62 పనులు. పూతలపట్టు నియోజకవర్గంలో ఒక కోటి రూపాయలతో 27 పనులు. కుప్పం నియోజకవర్గంలో రూ.4.20 కోట్లతో 62 పనులు. నగరి నియోజకవర్గంలో ఒక కోటి రూపాయలతో 9 పనులు. పుంగనూరు నియోజకవర్గంలో రూ.91.50 లక్షలతో 28 పనులు. మొత్తం రూ.12.89 కోట్లతో 248 పనులు పూర్తి చేయడమైనదన్నారు.

# జిల్లా ప్రధాన ఆసుపత్రికి వచ్చే పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## - జిల్లా కలెక్టర్

**చిత్తూరు - సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా ప్రధాన ఆసుపత్రికి వచ్చే పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబందిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరము నందు జిల్లా ప్రధాన ఆసుపత్రి నందు పేషంట్లకు అందించే సేవలపై జిల్లా కలెక్టర్ అద్యక్షతన ఆసుపత్రి సూపరిండెంట్,డి సి హెచ్ ఎస్, అపోలో యాజమాన్య ప్రతినిధులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో వివిధ విభాగాల ద్వారా పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఇందుకు సంబందిత అధికారులందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు.డాక్టర్ ఎన్ టి ఆర్ వైద్య సేవల ద్వారా అందించే వైద్య సేవలను విస్తృతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రి నందు అవసరమైన పరీక్షల నిర్వహణ సామర్ధ్యాన్ని పెంపొందించుకొనేందుకు కృషి



చేయాలని, తద్వారా పేద ప్రజలకు ఆరోగ్య భరోసాను కల్పించేందుకు అవకాశం ఉంటుందని, ఈ దిశగా పనిచేయాలన్నారు. ఆసుపత్రి నందు పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డి సి హెచ్ ఎస్ డాక్టర్ ప్రభావతి, డాక్టర్ ఎన్ టి ఆర్ వైద్యసేవా జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్, అపోలో యూనిట్ ఇంచార్జ్ నరేష్, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశంలో సమస్యలపై చర్చేది..!

**పాలసముద్రం - సూర్య వాస్తవం:** మండలంలో స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. కొంతమంది అధికారులతో పాటు కొద్దిపాటి ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశానికి స్థానిక ఎంపిపి శ్యామల శివప్రకాష్ రాజు, ఎంపీడీవో మహేష్ రెడ్డి అధ్యక్షత వహించారు.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశానికి పూర్తి స్థాయిలో ప్రజా ప్రతినిధులు హాజరు కాకపోవడం పలువురిని విస్మయానికి గురి చేసింది.మండల సరసభ్య సమావేశానికి పూర్తి స్థాయిలో ప్రజా ప్రతినిధులు హాజరు కాకపోవడంతో ప్రజల సమస్యలను వివరించే వారు లేరని, అధికారులు ఆడిందే ఆట-పాడిందే పాటగా మారిందని పలువురు నాయకులు ప్రజలు వాపోతున్నారు. గత సర్వ సభ సమావేశంలో ఎంపీటీసీల ఫోరం లేకపోవడంతో సర్వసభ సమావేశం వాయిదా పడింది. అ తర్వాత ఇప్పటివరకు మండల సర్వసభ్య సమావేశంలో మండల సమస్యలపై కానీ అభివృద్ధి పై కానీ సమగ్రంగా చర్చ జరిగిన దాఖలాలు లేవని పలువురు నాయకులు ప్రజలు వాపోతున్నారు. మండలంలో పంచాయతీ కార్యదర్శులు 13 మందికి ఐదుగురు ఉన్నారు. ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరిగినవి,



జరుగుతున్నాయో మండల ప్రజలకు సక్రమంగా తెలియదు. సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి పనులకు, వచ్చిన నిధులపై ఖర్చు అయిన తీరుపై సమావేశంలో ఇప్పటివరకు ఎవరూ అడిగి చర్చకు దారి తీసిన దాఖలాలు కనిపించడం లేదని ప్రజలు చెబుతున్నారు.దీనివల్ల సర్వసభ్య సమావేశం ప్రతిసారి నామమాత్రంగానే జరుగుతుంది.ఈ మండల సర్వసభ్య సమావేశంలో పలు శాఖ అధికారులు, ఆరు మంది ఎంపిటిసిలో గాను ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. 12 మంది సర్పంచులు గాను ఎడు మంది మాత్రమే సమావేశంకు హాజరయ్యారు. వీరు మాత్రమే నామమాత్రంగా వివరాలు చెప్పుకొని మెల్లమెల్లగా ఒకటిన్నర గంట సమయంలోనే సమావేశం ముగించుకుంటున్న పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి.ఇప్పటివరకు జరిగిన సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలు అవి అమలు అయిన తీరు ఎవరికి తెలియవు. ఈ సమావేశంలో సమస్యలపై చర్చకు దారి తీసే నాయకులే మండలంలో కరువయ్యారని ప్రజల నుండి విమర్శలు వస్తున్నాయి.గ్రామపంచాయతీ గురించి ఎంపీపీ కానీ, ఎంపీటీసీలు కానీ చర్చించే ప్రస్తావన కొరవడితే, మండల పరిషత్ లోని అభివృద్ధి నిధుల గురించి చేసే పనుల గురించి సర్పంచులు అడిగే ప్రస్తావన లేదు. దీంతో మండలంలో అభివృద్ధి ఎక్కడ జరుగుతుందో ,లేదా అవినీతి ఎక్కడ జరుగుతుందో ఎవరికి తెలిసే పరిస్థితి లేదు.కాబట్టి ఇప్పటికైనా మండల సర్వసభ్య సమావేశాన్ని పటిష్టంగా ఏర్పాటు చేసి మండలంలో వివిధ శాఖలు పనిచేస్తున్న తీరు, వాటి అభివృద్ధి, వచ్చిన నిధులపై ఇంకా వచ్చే సర్వసభ సమావేశంలో సమగ్రమైన చర్చ జరగాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# వాహనాల తనిఖీ

**బంగారుపాళ్యం - సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలోని పాలేరు బ్రిడ్జి వద్ద బుధవారం మధ్యాహ్నం 12 నుండి 2 గంటల వరకు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు బంగారు పాల్యం పోలీస్ స్టేషన్ సీఐ కే.శ్రీనివాసులు ఆధ్వర్యంలో, ఏఎస్ఐ రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో వాహనాల తనిఖీ నిర్వహించారు.నెంబర్ ప్లేట్లు, నేమ్ బోర్డులు, రికార్డులు లేని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహన చోదకులకు భారీ జరిమాన విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవ్, మైన డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు.వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ



కార్యక్రమంలో ఏఎస్ఐ రామచంద్రా రెడ్డి, పిసీలు రమేష్, కిరణ్ కుమార్, ప్రతాప్, యుగంధర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలికల హాస్టల్ తనిఖీ

## - జిల్లా జేసీ విద్యాధరి



**బంగారుపాళ్యం - సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజవర్గం బంగారుపాలెం మండలంలో సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్, గోదాములను బుధవారం మధ్యాహ్నం 12.30 లకు ఆకస్మికంగా జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి తనిఖీ చేపట్టారు. హాస్టల్లోని మరుగుదొడ్ల పరిశుభ్రత పై ఆరా తీశారు. విద్యార్థుల రిజిస్టర్లను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి వాటిపై హాస్టల్ వార్డెన్ గీతాను అడిగి తెలుసుకున్నారు.నూతనంగా నిర్మిస్తున్నటువంటి మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డులో ఉన్న గ్రామీణ గోదాము ను స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించి గోడౌన్ డిటి వాసును జెసి విద్యాదరి అడిగి తెలుసుకున్నారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉండడంతో జెసి విద్యాదరి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిడి రాజ్యలక్ష్మి, మండల తాసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, వారి సిబ్బంది పాల్గొన్నారు.

# కౌలుకు మొగిలి దేవస్థాన భూములు

## - ఈవో మునిరాజులు



**బంగారుపాళ్యం - సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామంలో వెలసిన శ్రీ స్వయంభు మొగిలేశ్వర స్వామి దేవస్థానం ఆలయ భూములను మూడు సంవత్సరములకు కాను కౌలుకు ఇచ్చుటకు 13-11-2024 వ తేదీ బుధవారం 9 గంటలకు దేవస్థాన ఆవరణలో బహిరంగ వేలము పాట నిర్వహించబడునని ఈవో మునిరాజులు తెలియజేశారు. ఈ వేలము లో పాల్గొనదలచిన వారు ముందుగా మూడు వేల రూపాయలు డిపాజిట్ చెల్లించవలెనని, హెచ్చు పాట దారుని డిపాజిట్ తప్ప ఇతరుల డిపాజిట్ వాపసు చేయబడునని తెలిపారు. దేవస్థానమునకు ఏ విధమైన బాకీలు ఉన్నవారు కానీ దేవస్థానములతో ఎట్టి లావాదేవీలు ఉన్నవారు కానీ దేవస్థాన సిబ్బంది గానీ ఇనామ్ దారులు గాని ఈ వేలము పాటలో పాల్గొన్న రాదని తెలిపారు. హెచ్చు పాట దారుడు వేలము పాట ముగిసిన వెంటనే ఒక్క సంవత్సరం గుత్త చెల్లించవలెనని, భూమి ఉన్న ప్రాంతం గురించి పూర్తిగా తెలిసిన వారే వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. మొగిలి దేవస్థానానికి సంబంధించి, మొగిలి, 170 గొల్లపల్లి, టేకుమంద, ఊటు వంక ప్రాంతాల్లో సుమారు 44 ఎకరములకు వేలంపాట నిర్వహించబడునని మొగిలి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, ఈవో మునిరాజులు తెలిపారు. వేలంపాటలో పాల్గొన్న దలచిన వారికి ఎటువంటి సందేహము ఉన్న 9441761536. నెంబర్ ను సంప్రదించాలని ఈవో మునిరాజులు తెలియజేశారు

# మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా



**చిత్తూరు - సూర్యా వాస్తవం:** జిల్లా ఎస్పీ వి.ఎన్ మణికంఠ చందోలు, ఐపీఎస్ ఆదేశాల మేరకు చిత్తూరు సబ్ డివిజన్ డి.ఎస్పీ టి.సాయినాథ్ ఆద్వర్యంలో చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్య బాబు నిన్నటి దినం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 22 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ఈ రోజు ఉదయం ప్రవేశపెట్టగా జడ్జ్ శ్రీమతి ఉమా దేవి వాహనదారులకు 22 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం 2,20,000/- రూ.లు జరిమానా విధించడం జరిగింది. ఈ 11 నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన 473 మందికి సుమారు 47.4 లక్షల రూపాయల ఫైన్ విధించడం జరిగింది. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లా లోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరం, ఇది మీ ప్రాణాలకు, ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తుంది. మద్యం సేవించిన వ్యక్తి డ్రైవింగ్ చేయడం పై సెక్షన్ 185 క్రింద మొదటి సారి నేరం చేస్తే రూ. 10,000/- జరిమానా, లేదా 6 నెలల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చు, రెండవ సారి నేరం చేస్తే రూ.15,000/- లేదా 3 సం.ల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చునని కావున వాహనం నడిపే సమయంలో వాహనదారులు రోడ్డు భద్రతా మరియు రహదారి నిభందనలు తప్పక పాటించి ప్రమాదాలు, జరిమానాలు, శిక్షలకు గురి కాకుండా ఉండాలని ఇన్స్పెక్టర్ కోరారు.

# శ్రీవారి సేవలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ



**చిత్తూరు - సూర్యా వాస్తవం:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సేవలో తరించారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం చిత్తూరు ఎంపీకి తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచన అందించగా, అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందించారు. అంతకు ముందు తిరుమల తిరుపతి దేవస్థానం 54వ పాలకమండలి అధ్యక్షులుగా నియమితులైన బి. రాజగోపాల నాయుడి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు హాజరయ్యారు. తిరుమల శ్రీవారి సన్నిధిలో నూతన టిటిడి చైర్మన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆలయం వెలుగులకు వచ్చిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మీడియాతో మాట్లాడారు. టిటిడి సమర్థవంతంగా పనిచేయడం వల్లే శ్రీవారి భక్తులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయని అన్నారు. కొత్తగా నియమితులైన టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు నేతృత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఖ్యాతిని మరింతగా ఇనుమడింప చేయగలరనీ ఆయన అభిప్రాయపడ్డారు.

# ప్రభుత్వ కార్యక్రమాలను అందిపుచ్చుకోవడంలో మహిళలు ముందుండాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**




**అనంతపురం బ్యూరో - సూర్య వాస్తవం:** మహిళలు బాగా చదువుకోవాలి.. ఉద్యోగాలు చేసి వారి కాళ్ళపై స్వశక్తితో నిలబడాలని, ప్రభుత్వ కార్యక్రమాలను అందిపుచ్చుకోవడంలో వారు ముందుండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం రూరల్ పరిధిలోని పంగల్ రోడ్ లో ఉన్న టీటీడీసీ కేంద్రంలో నిర్వహించిన ప్రశాంతి జిల్లా పరస్పర సహాయ సహకార సంఘాల ఫెడరేషన్ లిమిటెడ్ 20వ వార్షిక మహాసభలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా దేశంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో మండల, జిల్లా సమైక్యలు ఏర్పాటు చేయడం, అందులో మహిళా సభ్యుల్ని సభ్యులుగా చేయడంలో అనంతపురం జిల్లా ముందుందని, ఇందుకు చాలా గర్వకారణంగా ఉందన్నారు. ఈ సమయంలో మా అమ్మ గుర్తొచ్చిందని, మా అమ్మ మహిళలు ఎప్పుడూ చదువుకోవాలని, ఉద్యోగాలు చేయాలని, చదువుకుంటే గౌరవం వస్తుందని, ఆదాయం వస్తే వారి కాళ్లపై నిలబడతారని, సొంతంగా నిర్ణయం తీసుకునే శక్తి వస్తుందని చెబుతూ ఉండేదని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు సంఘంలో రుణాలు తీసుకుని ప్రతి మహిళ ఎంతో సాధన చేసి సొంత కాళ్లపై నిలుచున్నారని, ప్రతి ఒక్కరూ విభేదాలు పక్కన పెట్టి సంఘముగా ఏర్పాటై రుణాలు తీసుకొని అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు రావాలంటే ఎంతో కృషి చేయడం జరిగిందన్నారు. ప్రశాంతి జిల్లా సమైక్య ఏర్పాటై 20 సంవత్సరాలు అన్ పూర్తయింది అంటే గర్వకారణంగా ఉందన్నారు. ఎంతో నిబద్ధత, చిత్తశుద్ధితో పనిచేసి ఈ స్థాయిలో నిలవడం ఎంతో గొప్ప విషయం అని, ఇది ఇలాగే ముందుకెళ్లాలని, ఇందుకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు కావాల్సిన సహాయ సహకారాలు అధికారులు అందించాలని ఆదేశిస్తున్నామన్నారు. మహిళలు బాగా చదువుకోవాలని, ఉద్యోగాలు చేయాలని, వారి కాళ్ళపై స్వశక్తితో నిలబడాలన్నారు. మహిళలు బాగుంటే కుటుంబం బాగుంటుందని, తద్వారా గ్రామం, దేశం బాగుంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను అందుకోవాలని, మహిళలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణానికి అవసరమైన రుణాలు ఇవ్వాలని, దీపం -2, ఉపాధి హామీ, ఇతర ప్రభుత్వ పథకాలపై సమావేశాలను జిల్లా, మండల, గ్రామ సమైక్యలలో నిర్వహించి వాటి పట్ల అందరికీ తెలపాలన్నారు. ఇళ్ల నిర్మాణానికోసం స్వయం బు సహాయక సంఘాల మహిళలకు రుణాలు అందించడంలో జిల్లా ముందుండాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ను ప్రశాంతి జిల్లా సమాఖ్య తరపున సంఘాల సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఈశ్వరయ్య, ఐసిడిఎస్ పిడి బిఎన్ శ్రీదేవి, ప్రశాంతి జిల్లా సమైక్య అధ్యక్షురాలు శేకున్ బి, ఉపాధ్యక్షురాలు సుజాత, రెడ్ సంస్థ ప్రతినిధి భానుజా, కార్యదర్శి రాధ, అకౌంటెంట్ ప్రమీలమ్మ, సభ్యులు సుహాసిని, లలిత, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం వహిస్తే తాటా తీస్తా..!



**పత్తికొండ - సూర్య వాస్తవం:** విధుల్లో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే కెఈ శ్యాం బాబు హెచ్చరించారు. బుధవారం పత్తికొండలో ఆయన సుడిగాలి పర్యటన చేసి సచివాలయం3, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, మోడల్ స్కూల్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం-3 లో అటెండర్ రిజిస్టర్ను పరిశీలించారు. కార్యాలయంలో ఒక ఉద్యోగి ఉండడంతో మిగిలిన వారు ఎక్కడని ప్రశ్నించారు. ఫీల్ కు వెళ్లారని చెప్పడంతో మీ కార్యాలయంపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్ప వని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్రంలో కాలం చెల్లిన యూరియా బస్తాలు చూసి ఇదేంటని సిబ్బందిని ప్రశ్నించారు. అధికారులకు తెలిసిన అక్కడ సిబ్బంది చెప్పడంతో వెంటనే అవన్నీ క్లీన్ చేసి కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచాలని మరోసారి తనిఖీకి వచ్చినప్పుడు ఇలాంటివి కనిపిస్తే చర్యలు తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు వేసిన వ్యాక్సిలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న సమస్యల గురించి సిబ్బంది ఆయనకు తెలపడంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అక్కడినుంచి మోడల్ స్కూల్ కి వెళ్లిన ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో పనిచేయని ఆరో ప్లాంట్ పై ప్రిన్సిపాల్ ని ప్రశ్నించారు. విద్యార్థులకు మంచి నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్లాంట్లు ఎలా వృధాగా వదిలేస్తారని వెంటనే దాన్ని బాగు చేయించాలని చెప్పారు. పాఠశాలలో ఉన్న ల్యాబ్ను పరిశీలించి విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని అన్ని రకాలుగా వెనుకబడి ఉన్న పత్తికొండ ప్రాంతంలో విద్యార్థులకు చదివి ఎంతో అవసరం అన్నారు. పదవ తరగతి క్లాస్ రూమ్ లో విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నో మంచి అవకాశం విద్యార్థులు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తును అందుకోవాలని సూచించారు. ఆయనతోపాటు టిడిపి నాయకులు సాంబశివరెడ్డి తుగ్గలి నాగేంద్ర మనోహర్ చౌదరి తదితరులు ఉన్నారు.

# నిత్యావసర సరుకులపై ధరలు తగ్గించాలి



**రాప్తాడు - సూర్య వాస్తవం:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర సరుకులు వంటనూనెలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సావిత్రమ్మ మండిపడ్డారు. బుధవారం రాప్తాడు మండల కేంద్రం నందు సిపిఎం పార్టీ అనంతపురం రూరల్, రాప్తాడు మండల, మహాసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సావిత్రమ్మ, ఎం బాల రంగయ్య హాజరయ్యారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 8 వ తేదీ నుండి 14 వ తేదీ వరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే నిరసన కార్యక్రమాల్లో జిల్లా ప్రజానీకం పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహిళలు పిల్లలు దళితులు పై జరుగుతున్న అత్యాచారాలు దాడులు అరికట్టాలి.అధిక ధరలను తగ్గించాలి. జనాభాకు తగ్గట్టు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. యువతకు ఉపాధి నిరుద్యోగ భృతి కల్పించాలి.2023 పంటల బీమా విడుదల చేయాలని సాగు తాగునీటి రంగాలకు బడ్జెట్ లో నిధులు కేటాయించాలి. పీఏబీఆర్ కుడికాలు నుండి 49 చెరువులకు సాగు తాగునీరు ఇవ్వాలనే డిమాండ్లతో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ రాప్తాడు మండల కార్యదర్శులు టి.రామాంజనేయులు మండల కార్యదర్శి ఎం.పోతులయ్య, చంద్రిక, మండల నాయకులు పుష్ప రాజు, తిరుపాలు, రాయమ్మ రాజు, గోపాల్, ప్రకాష్, సభ్యులు నారాయణమ్మ పెద్దిరాజు, ఆదినారాయణ వన్నూరుస్వామి, నాగరాజు సుబ్బారావు, ప్రతాప్ నారాయణస్వామి, వెంకట్రాముడు, పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి బిసిసి రోడ్డు సబ్ రిజిస్టర్ కార్యాలయం ప్రక్కన తోపుడు బండిపై చిన్నపాటి టీ హోటల్ పెట్టుకొని బ్రతుకు జీవనం సాగిస్తున్న మాబూ (50)ని శనివారం సాయంత్రం కల్లూరుకు చెందిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తలకు తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి తీసుకపొమ్మన్నారు.అక్కడి వైద్యులు,బెంగుళూరు,హైదరాబాద్ తీసుకొని పొమ్మనడంతో బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి ఇద్దరు భార్యలుకలరు.మొదటి భార్యకు పక్షపాతం రావడంతో రెండవ భార్యను వివాహం చేసుకున్నాడని,మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు రెండవభార్యకు ఒక కుమారుడు కలడు. బుధవారం అంతక్రియలు జరిపారు. ద్విచక్ర వాహనంను పోలీసుల ఆధీనంలో వుంది పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. మృతుడు అతి బీదకుటుంబీకుడని,భూములు కూడాలేవని, కుటుంభం గడవడం చాలా కష్టతరమని గ్రామస్తులు, వెల్లడించారు. ఇటువంటి సంఘటనలు పామిడి పట్టణంలో తరచూ జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనంపై ముగ్గరు నల్గురు పోతున్నా, మైనారిటీ పిల్లలు వాహనాలను స్పీడుగా నడుపుతున్నా పోలీసులు పట్టించుకోక పోవడం శోచనీయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ కళాశాల,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు వదిలిన కాలం మధ్యాహ్నం, సాయంత్రం జూలైవెదవులు ఆడపిల్లల కోసం బీట్ కొట్టడానికి చేస్తున్న అల్లరి మూఖల చేష్టలతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈవిషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పలితం లేదన్నారు. పట్టణంలో ఇలాంటి వారితోపాటు మద్యం షాపులు ఇదేరోడ్డుకు వున్నందున త్రాగుబోతులు 80, 90 కిలోమీటర్ల వేగంతో వాహనాలను నడుపుతున్నా పోలీసులు పట్టించుకోకుండా, చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ఇలాంటి వారు రోజురోజుకూ మితిమీరి పోతున్నారని ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా కళాశాలదగ్గర నిఘావుంచాలని, వాహనాల వేగం నియంత్రించాలని కోరుతున్నారు. వాహనాల తనిఖీ రోజూ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

# అనాథ పిల్లలకు దుస్తుల పంపిణీ

**- పిల్లలను హాస్టల్లో చేర్పించిన అంగన్వాడీ సూపర్వైజర్ సుమిత్ర**



**పత్తికొండ - సూర్య వాస్తవం:** పత్తికొండ నియోజకవర్గం లోని మారెళ్ళ గ్రామంలో తల్లి తండ్రి లేని అనాథ పిల్లలు జయశ్రీ, అంకిత, ఉషశ్రీ లకు చెన్న రెడ్డీ దంపతులు దుస్తులు పంపిణీ చేశారు. చెన్నారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అనాధలకు రెండేసి జతల బట్టలు అందించారు. ఈ సందర్భంగా అను ఫ్యాషన్ చిన్నారెడ్డి మాట్లాడుతూ.... సహాయం ఉన్న చోట ఆదుకోవడానికి గ్రామస్తులు యువకులు ముందుకు రావాలని కోరారు. పిల్లల విపత్కర సమయంలో మా గ్రామంలో మా శక్తి మేరకు అనాధలకు ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. అంగన్వాడి సూపర్వైజర్ సుమిత్ర పిల్లలను హాస్టల్లో చేర్పింపీ మానవత్వం చాటారు.

# వలస బాటలో చక్రాల పల్లె జనం

**- ఉపాధి లేక బిక్కుబిక్కుమంటున్న పల్లె జనం**

**- పనుల కోసం పట్టణానికి పరుగులు**




**పత్తికొండ - సూర్య వాస్తవం:** పనిలేక.. పొట్ట కూటి కోసం చక్రాల పల్లె జనం పట్నం బాట పడుతున్నారు. దీనికి సరైన కారణం.....గ్రామాల్లో కరువొచ్చిందా...? చేసేందుకు చేతినిండా పనిలేద.... ! పూట గడవడం కష్టమైందో పిల్లలను సాకడం భారమైంది. బతుకుబండి నడిపించాలి.. దూరమైనా పని దొరికినకాడికే పోవాలంటూ పత్తికొండ చుట్టుపక్కల ఉన్న పల్లె జనం( సుగ్గి )పట్నంబాట పట్టారు. గ్రామాల్లో చేయడానికి పనులు లేక రైతులు, గిరిజనులు, కూలీలు నగరాలకు బెల్లెల్లారు. పెద్ద పెద్ద నగరాలలో తాపీమేస్త్రీలు.. వంటమనుషులు, గుమస్తాలుగా చేరుతున్నారు. పల్లెల్లోనీ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లడంతో పత్తికొండ చుట్టూ పక్కల లోని పల్లెలు, తండాలు బోసిపోతున్నాయి.'ఉపాధి' లేక.. సరైన వర్షాభావం, 'ఉపాధి' లేకపోవడమే దీనికి ప్రధాన కారణం.

# కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో యురేనియం తవ్వకాలు ఏమి లేవు

**- కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్**



**కర్నూలు - సూర్య వాస్తవం:** దేవనకొండ మండలం కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ చుట్టుపక్కల గ్రామాలలో యురేనియం లభ్యత, పరిశోధన కోసం ఎలాంటి బోరు తవ్వకాలు జరగడం లేదని కర్నూలు జిల్లా కలెక్టర్ బుధవారం నాడు తెలియజేశారని, కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ చుట్టుపక్కల గ్రామ ప్రజలు గమనించాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందవద్దని జిల్లా ఎస్పీ కోరారు. ఎలాంటి వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మొద్దని సూచించారు. ఎవరైనా ఈ విషయాన్ని అనవసరంగా ప్రజలను భయాందోళనకు గురిచేసే వారిపై, సోషల్ మీడియా లో అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.

# టీటీడీ ఛైర్మన్ కు ముస్లిం మైనార్టీ నాయకులు దాదు శుభాకాంక్షలు



**అనంతపురం - సూర్య వాస్తవం:** తిరుమల తిరుపతి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా బొల్లినేని రాజగోపాల్ నాయుడు (బి. ఆర్ నాయుడు), టీటీడీ మెంబర్ గ ఎమ్మెస్ రాజు బుధవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశాల మేరకు వారికి అనంతపురం జిల్లా టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు దాదు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దాదు మాట్లాడుతూ మీ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని, భక్తాదులకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని వారిని కోరారు.

# షెడ్యూల్డ్ మేరకు పదోన్నతులు చేపట్టాలి



**అనంతపురం - సూర్య వాస్తవం:** ప్రభుత్వం చేపట్టిన పురపాలక నగరపాలక ఉపాధ్యాయుల పదోన్నతులు షెడ్యూల్ మేరకు నిర్వహించాలని ఎస్టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి రామాంజనేయులు జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్ బాబుకు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ ఇదివరకే వచ్చినందున ఈరోజు జరగాల్సిన ప్రధానోపాధ్యాయుల తోపాటు, పాఠశాల సహాయకుల పదోన్నతులు షెడ్యూల్ మేరకు చేపట్టాలని తెలిపారు. చాలా సంవత్సర తర్వాత పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల పదోన్నతులను చేపట్టుతున్నందున ఆలస్యం లేకుండా జరపాలని, మొత్తం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆర్ డి ఏం.ఏ వారు పదోన్నతి ప్రక్రియలో ఎక్కడ రోస్టర్ ఆగిందో రికార్డులను పరిశీలించి దాని కొనసాగించాలని, ఇదివరకే ఇతర మేనేజ్మెంట్లో ఉపాధ్యాయులు ఎవరికైనా రోస్టర్ పాయింటు కేటాయించి ఉంటే వాటిని ఒక సంవత్సరం పైగా కాలం అయింది కాబట్టి రద్దు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తనకు ప్రధాన కార్యదర్శి సూర్యుడు రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ సీనియర్ నాయకులు అజయ్ కుమార్ నగర అధ్యక్షులు ప్రభాకర్, వన్నూరప్ప, మల్లికార్జున, యుగంధర్, మురళీకృష్ణ, విరుపాక్షి గౌడ్, రామకృష్ణ, నౌషద్, ఖలిముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# 'సన్‌ఫ్లవర్స్' ఆస్కార్‌కి ఎంపిక






'సన్ ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ వన్ టు నో' అనే భారతీయ షార్ట్ ఫిలిం 2025 ఆస్కార్‌కు అర్హత సాధించింది. చిదానంత ఎస్ నాయక్ తెరకెక్కించిన ఈ చిత్రం ఆస్కార్ రేసుకు అర్హత దక్కించుకుందని చిత్ర నిర్మాత తెలిపారు. పలు హాలీవుడ్ చిత్రాలతో పోటీపడిన ఈ చిత్రం ఆస్కార్ బరిలో ఎంట్రీ ఇవ్వటంతో నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. లైవ్ యాక్షన్ విభాగంలో తమకు అవకాశం దక్కినట్లు పేర్కొన్నారు. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ -2024 ఉత్తమ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఈ చిత్రాం అవార్డు దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషలకు చెందిన 17 చిత్రాలతో పోటీపడి తొలిస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. 16 నిముషాల పాటు నిడివితో ఉన్న ఈ షార్ట్ ఫిలింను కన్నడ జానపద పథ ఆధారంగా తెరకెక్కించారు. ఓ వృద్ధురాలి కోడిని కొందరు దొంగలించటంతో కథ ప్రారంభం అవుతుంది. ఎలాగైనా సరే దానిని కనుగొని ఆ కోడిని తిరిగి తెచ్చుకోవడం కోసం ఆమె పడే తపనను ఇందులో దర్శకుడు చూపారు. ఇప్పటికే కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో సత్తా చాటిన 'సన్ ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ వన్ టు నో' చిత్రం ఆస్కార్ అవార్డును కూడా దక్కించుకుంటుందని ఆశిస్తున్నారు. మైసూరుకు చెందిన నాయక్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే ఎంబిబిఎస్ పూర్తిచేసిన ఆయన సినిమా నిర్మాణ రంగం వైపు అడుగులేస్తున్నారు. ఆయన నిర్మించిన ఈ సినిమా ఆస్కార్‌కు అర్హత సాధించటంతో తన సొంతవూరైన శివమొగ్గలో సంబరాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే భారత్ నుంచి 'లాపతా లేడీస్' ఆస్కార్ బరిలో ఉన్న విషయం తెలిసిందే. కిరణ్ రావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది.




# ఫిబ్రవరి 7న దుల్లకొట్టేదాం

## యువ సామ్రాట్ నాగ చైతన్య




యువ సామ్రాట్ నాగ చైతన్య హీరోగా, చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'తండేల్' విడుదలకు సిద్ధమవుతోంది. అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మకమైన గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రొడక్షన్ పూర్తి కావస్తుండగా, రిలీజ్ డేట్ ని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. తండేల్ ఫిబ్రవరి 7, 2025న ప్రేక్షకుల ముందుకు రానుంది. వాలెంటైన్స్ డే కి ముందు సినిమా రిలీజ్ కావడం, సీజన్‌లోని రొమాంటిక్ మూడ్‌ను క్యాపిటిలైజ్ చేసుకునే పర్ఫెక్ట్ ఆపర్చునిటీ. రిలీజ్ డేట్ పోస్టర్ లో లీడ్ పెయిర్ నాగ చైతన్య మరియు, పల్లవి మధ్య కెమిస్ట్రీ అదిరిపోయింది. ఇది అందమైన సముద్ర నేపథ్యంలో సెట్ చేయబడింది. ఈ పోస్టర్ వారి పాత్రలు మధ్య డీప్ లవ్ ని సూచిస్తుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్‌లకు అద్భుతమైన స్పందన రావడంతో సినిమాపై భారీ బజ్ ఏర్పడింది. బ్లాక్‌బస్టర్ హిట్ 'లవ్ స్టోరీ' తర్వాత నాగ చైతన్య, సాయి పల్లవి జోడిని మరోసారి తెరపై చూడటానికి అభిమానులు ఎంతగానో ఎదురుచుస్తున్నారు.

రిలీజ్ డేట్ ప్రెస్ మీట్ లో హీరో నాగ చైతన్య మాట్లాడుతూ.. ప్రేక్షకులకు, అభిమానులకు అందరికీ నమస్కారం. నా కెరీర్‌లో ఇప్పటి వరకు రిలీజ్ డేట్‌ను ముందుగా అనుకొని దాన్ని బట్టి సినిమా పూర్తిచేసేవాడిని. సినిమా మొత్తం పూర్తయ్యాక రిలీజ్ డేట్ చెబితే బాగుండేదని అనుకునేవాడిని. ఒక యాక్టర్ కి రిలీజ్ డేట్ ఎప్పుడు అని తెలుసుకోవాలని వుంటుంది. అరవింద్ గారికి రిలీజ్ డేట్ గురించి అడిగాను. ఆయన ముందు సినిమా చూపించండని అడిగారు. నేను అనుకున్న సినిమా అక్కడ కనిపిస్తే రిలీజ్ డేట్ చెప్తాను అన్నారు. ఆ మాట ఆయన అన్నప్పుడు నాకు చాలా హ్యాపీగా అనిపించింది. సినిమా అంటే ఇలానే తీయాలి. ఇది మామూలు సినిమా కాదు. శ్రీకాకుళంలో కొందరు మత్స్యకారుల జీవితం. వారి కష్టం దేశం అంతా షేక్ చేసింది. మేము ఎడిట్ చూశాం. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ చేసినా అది పండగే అవుతుంది. ఫిబ్రవరి7 డేట్ పై నేను చాలా సంతోషంగా వున్నాను. మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉన్నాం. 100% లవ్ సినిమాతో వాసు తో నా జర్నీ స్టార్ట్ అయింది. ఆయనతో మళ్ళీ ఒక సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. గీతా ఆర్ట్స్‌లో ఈ స్టోరీ లైన్ గురించి వినగానే నాకు చేయాలని అనిపించింది. చాలా పెద్ద కాన్వాస్ సినిమా ఇది. ఈ పాత్ర గురించి తెలుసుకోవాలని శ్రీకాకుళం వెళ్లి మత్స్యకారులతో గడిపాం. నన్ను తెరపై నెక్స్ట్ లెవల్ లో చూపించాలని డైరెక్టర్ చందు చాలా కష్టపడ్డారు. సాయి పల్లవి క్వీన్ ఆఫ్ బాక్సాఫీస్. తన పాత్ర గురించి కాదు అన్ని పాత్రల గురించి ఆలోచిస్తూ చాలా సపోర్ట్ చేస్తుంది. ఫిబ్రవరి 7.. దుల్లకొట్టేదాం. అందరికీ థాంక్ యూ.' అన్నారు. హీరోయిన్ సాయి పల్లవి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ వేడుకని చూస్తుంటే ఒక ప్రీ రిలీజ్ ఈవెంట్ లా అనిపిస్తుంది. ఈ సినిమా చేసినప్పుడు కంటే ఇప్పుడు చాలా పెద్ద కాన్వాస్ అయింది. గీత ఆర్ట్స్ అల్లు అరవింద్ గారు, బన్నీ వాస్ గారు నాకు ఎలాంటి అవార్డు వచ్చినా, నా సినిమా విజయమైనా ఎంతగానో గౌరవించి, సన్మానిస్తారు. ఒక కూతురులా చూసుకుంటారు. దానికి నేను థాంక్యూ తప్ప ఇంకేం చెప్పలేను. మంచి కంటెంట్ ఎప్పుడు వస్తుందో జనాలకి అప్పుడు నచ్చేస్తుంది. ఫిబ్రవరి 7న ఈ సినిమా రావడం చాలా ఆనందంగా ఉంది చాలా బ్యూటిఫుల్ డేట్ అది. ఈ సినిమా అందరికీ నచ్చాలని కోరుకుంటాను. చాలా ఎఫర్ట్ పెట్టి సినిమా చేశాం. అందరికీ థాంక్యూ సో మచ్' అన్నారు. డైరెక్టర్ చందూ మొండేటి మాట్లాడుతూ.. అల్లు అరవింద్ గారి లాంటి గ్రేట్ ప్రొడ్యూసర్ అన్నీ చూసే డేట్ వేస్తారు. బిలీవ్ మీ.. అరవింద్ గారు ఏదైతే డేట్ ఇచ్చారో.. ఈ సినిమాకి ది బెస్ట్ రెవిన్యూ, నెంబర్స్ మనం చూస్తున్నాం. థాంక్యూ సో మచ్' అన్నారు.



# కింగ్ కోహ్లీ - 36




విరాట్ కోహ్లీ క్రికెట్ అభిమానులు ముద్దుగా కింగ్ కోహ్లీ అని పిలుచుకున్న విరాట్ కోహ్లీ నేడు 36వ సంవత్సరంలోకి అడుగుపెట్టాడు. ఫార్మేట్ ఏదైనా సరే అతడు రంగంలోకి దిగితే పరుగుల వరదే. తనకంటూ ప్రత్యేకమైన శైలిని ఏర్పాటు చేసుకొని కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నాడు. ఆటకు మాత్రమే కాదు, ఆయన వ్యక్తిత్వానికి కూడా అభిమానులు ఉన్నారు. సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజున స్వదేశంలో జరిగిన ప్రపంచకప్ సందర్భంగా వన్డేల్లో 49వ సెంచరీతో విరాట్ కోహ్లీ 35వ పుట్టినరోజు జరుపుకున్నాడు. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్, రైట్ హ్యాండర్ అంతర్జాతీయ క్రికెట్‌లో అనేక రికార్డులను బద్దలు కొట్టాడు.

### అత్యుత్తమ అంతర్జాతీయ రికార్డులను పరిశీలిద్దాం

గత ఏడాది స్వదేశంలో జరిగిన ప్రపంచకప్‌లో భారత బ్యాటింగ్ దిగ్గజం 765 పరుగులు చేయడంతో వన్డేల్లో సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్లో భారత్ ఓడిపోగా, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డుతో కోహ్లీ నిష్క్రమించాడు. 2023లో అత్యధిక వన్డే సెంచరీలు చేసిన సచిన్ టెండూల్కర్ రికార్డును విరాట్ కోహ్లీ బద్దలు కొట్టాడు. ముంబైలో జరిగిన ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ తన 50వ వన్డే సెంచరీని సాధించాడు.

టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు రోహిత్ శర్మ తర్వాత విరాట్ కోహ్లీ రెండో స్థానంలో ఉన్నాడు. కోహ్లీ 4188 పరుగుల వద్ద పూర్తి చేయగా, రోహిత్ 4231 పరుగులు చేశాడు. ఆసక్తికరంగా, ఈ ఏడాది ప్రారంభంలో భారతదేశం యొక్క ప్రపంచ కప్ విజయం తర్వాత వీరిద్దరూ టీ20లకు రిటైర్మెంట్లను ప్రకటించారు.

టీ20ల్లో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు సాధించిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు. అతని పేరు మీద ఏడు అవార్డులు ఉన్నాయి. న్డేల్లో అత్యంత వేగంగా 13000 పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు. అతను 267 ఇన్నింగ్స్‌లలో ఈ ఫీట్‌ని చేరుకున్నాడు. సచిన్ టెండూల్కర్ 321 ఇన్నింగ్స్‌లలో సాధించిన రికార్డును బద్దలు కొట్టాడు.

టీ20ల్లో అత్యధిక యాభైకి పైగా స్కోర్లు సాధించిన పాకిస్థాన్ ఆటగాడు బాబర్ అజామ్‌తో విరాట్ కోహ్లీ సమానంగా ఉన్నాడు. వీరిద్దరి పేరు మీద 39 అర్థ సెంచరీలు ఉన్నాయి. విరాట్ కోహ్లీ అత్యధిక ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు (టెస్టులు, వన్డేలు, టీ20లు) కలిపి రికార్డు సృష్టించాడు.

అతని పేరు మీద మొత్తం 21 ఉన్నాయి. అంతర్జాతీయ క్రికెట్‌లో (టెస్ట్, వన్డే, టీ20) అత్యధిక ఫోర్లు బాదిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లీ నాలుగో స్థానంలో నిలిచాడు. అతని పేరు మీద 2682 ఫోర్లు ఉన్నాయి. వన్డేల్లో అత్యధిక అర్ధశతకాలు సాధించిన రెండో ఆటగాడిగా విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు. అతని పేరుకు 122 ఉన్నాయి, సచిన్ టెండూల్కర్ 145తో అగ్రస్థానంలో ఉన్నాడు.

# 4వ స్థానంలో మంధాన

## టాప్-10లో హర్మన్‌ప్రీత్‌కు చోటు

**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి ప్రకటించిన మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా బ్యాటర్లు సత్తా చాటారు. భారత, న్యూజిలాండ్ క్రికెటర్లు తమ స్థానాలు, పాయింట్లను మెరుగుపర్చుకోవడం విశేషం. టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (654) మూడు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంకుకు చేరింది. కివీస్‌పై వన్డే సెంచరీ బాదిన మంధాన ర్యాంకింగ్స్‌లో ఎలాంటి మార్పు లేదు. మంధాన (728) రేటింగ్ పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. గతంతో పోలిస్తే 703 పాయింట్ల నుంచి 728కి చేరింది.



దీంతో టాప్-3 ర్యాంకుకు చేరువగా వచ్చింది. లారా వాల్వార్డ్ట్ (756), నాట్ స్కివెర్ బ్రంట్ (760), చమరి ఆటపట్టు (733) టాప్-3లో ఉన్నారు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (538) భారత్ తరఫున టాప్-20లో నిలిచిన మూడో ప్లేయర్ కావడం విశేషం. ప్రస్తుతం ఆమె ఒక ర్యాంక్‌ను మెరుగుపర్చుకుని 19వ స్థానంలో నిలిచింది. బౌలర్ల విభాగంలో దీప్తి శర్మ 703 పాయింట్లతో 2వ స్థానంలో నిలువగా.. ఇంగ్లండ్ బౌలర్ సోఫీ ఎక్లెస్టోన్ (770) టాప్‌లో ఉంది. భారత యువ బౌలర్ ప్రియా మిశ్రా ఏకంగా 77 స్థానాలను మెరుగుపర్చుకోవడం గమనార్హం. దీంతో తొలిసారి వందలోపు ర్యాంకుల్లోకి వచ్చింది. ప్రస్తుతం 271 పాయింట్లతో 83వ స్థానం దక్కించుకుంది. రేణుకా సింగ్ (424) కూడా నాలుగు స్థానాలను మెరుగుపర్చుకుని 32వ ర్యాంకును సొంతం చేసుకుంది. ఆల్‌రౌండర్ల జాబితాలో దీప్తి శర్మ ఒక్క ప్లేయరే భారత్ నుంచి టాప్-10లో ఉంది. ఆమె 378 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. ఈ విభాగంలో దక్షిణాఫ్రికా క్రీడాకారిణి మరిజన్నె కాప్ (404) అగ్రస్థానంలో ఉంది.

# జాతీయ ఫెన్సింగ్ పోటీలకు సెయింట్ జాన్స్ విద్యార్థిని ప్రియూష ఎంపిక

**గన్నవరం (కృష్ణాజిల్లా) :** ఈ నెల 17 నుండి 21 వరకు జమ్మూ కశ్మీర్‌లో జరగనున్న జాతీయ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-17 పోటీలకు కృష్ణా జిల్లా గన్నవరం సెయింట్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని ధనాల నాగ ప్రియూష ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సంతోష్ కుమార్ మంగళవారం తెలిపారు. అక్టోబర్ 20 నుండి 22 వరకు నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో కృష్ణా జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించిన ప్రియూష తనదైన శైలిలో క్రీడా నైపుణ్యం ప్రదర్శించి శాబర్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు చెప్పారు. దీంతో జమ్మూ కశ్మీర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపల్‌తో పాటు స్కూల్ సిబ్బంది అభినందించారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల



**డోన్-సూర్య వాస్తవం:** డోన్ పట్టణ రిత్విక్ గారి కుమార్తె వివాహము కర్నూలు నగర బైరెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమంనకు కేంద్ర మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మరియు డోన్ సభ్యులు అయిన కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## డోన్ నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తా



**డోన్- సూర్య వాస్తవం:** బుధవారం రోజున డోన్ పట్టణంలోని ఆర్ అండ్బి గెస్ట్ హౌస్లో డోన్ ప్యాపిలి బేతంచెర్ల మూడు మండలాల అధికారులతో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి బుధవారం సమావేశం నిర్వహించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని లేకపోతే అధికారుల మీద చర్యలు తీసుకుంటాను అంటూ ఎమ్మెల్యే సూచించారు ఈ మూడు మండలాలని అభివృద్ధి పథకంలో నడిపించు చూపిస్తానంటున్న ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, మరియు గ్రామాల సచివాలయ సిబ్బందిని పాల్గొన్నారు

## ఎస్.హెచ్.జి. సభ్యుల సర్వే



**పలాస - సూర్య వాస్తవం:** పలాస కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయం లో కమీషనర్ నడిపేన రామారావు అధ్యక్షతన మెప్మా డిపార్ట్మెంట్ 48 మంది ఆర్.పి. మరియు సి.ఎల్.ఆర్.పి. లతో మెప్మా డిపార్ట్మెంట్ అధికారులతో ఎస్.హెచ్.జి. సభ్యులు యొక్క నమోదు కార్యక్రమ వివరాల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రతి ఎస్.హెచ్.జి. సభ్యులు సర్వే నమోదు కార్యక్రమం ను విజయవంతం చేయాలని ప్రతి ఒక్క ఆర్.పి. చురుకుగా పని చేస్తూ ఎస్.హెచ్.జి. సభ్యులకు సహాయ సహకారము అందించాలని సూచించారు.

## న్యూ డెమోక్రసీ అలుపెరగని పోరాటం




**పలాస - సూర్య వాస్తవం:** 1969 నవంబర్ 22వ తేదీన శ్రీకాకుళ సాయుధ పోరాట అమరవీరులు తామాడ గణపతి, డాక్టర్ చాగంటి భాస్కరరావులు పోలీసుల బూటకపు ఎదురు కాల్పుల్లో అమరత్వం చెందిన రోజున, మర్రిపాడు గణపతి నగర్ లో జరగనున్న శ్రీకాకుళ అమరవీరుల 46వ స్మారక సభను విజయవంతం చేయాలని సిపిఐ ( యం.యల్ ) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటి సభ్యుడు గొరకల బాలకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం వజ్రపుకొత్తూరు మండలం మర్రిపాడు గ్రామం అమరుడు గణపతి నగర్ లో నవంబర్ 22 కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ప్రజా సంఘాలతో కలిసి ఆవిష్కరిస్తూ ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం పోరుబాటలో వందలాది సమర యోధులు అమరుల్కె స్మృతి సంకేతాల్కె నిలిచారనీ అలాంటి విప్లవ పోరాట స్ఫూర్తిని, వర్గ కసిని రగిలించిన రోజే నవంబరు 22గా సాయుధ పోరాట చరిత్రలో నిలిచిపోయిందన్నారు. సమస్యలపై ఉద్యమం సాగాలనే లక్ష్యంతో ఉద్దానం గ్రామాల్లో ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పక్షం రోజుల పాటు విప్లవోద్యమ ప్రచార కార్యక్రమాన్ని ఈరోజు నుంచే నిర్వహిస్తున్నామన్నారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కోసం, ఉద్దానం కిడ్నీ వ్యాధి నివారణ కోసం సమరశీల పోరాటాలను నిర్మించాలని ఆవైపుగా ప్రజలను సమాయత్తం చేస్తున్నామని బాలకృష్ణ తెలిపారు. శ్రీకాకుళ గిరిజన సాయుధ రైతాంగ పోరాట అమరవీరులకు విప్లవ జోహార్లను అర్పించడమంటే వారు చూపిన పోరాట బాటలో పయనించడమేనన్నారు. అర్ధభూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం, సమ సమాజ నిర్మాణం కోసం భారత విప్లవోద్యమ నిర్మాణంలో అశువులు బాసిన అమరవీరులకు జోహార్లను అర్పించడం మనందరి బాధ్యత అన్నారు. ప్రజలు సంఘటితపడి సమరశీల ప్రతిఘటనా పోరాటాలను నిర్మించడం ద్వారానే ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం పొందడం వీలుపడుతుందనేది అమర నేతల ఆచరణ రుజువు చేస్తోందన్నారు. ఆనాడు అమర వీరుడు తామాడ గణపతి నేతృత్వంలో సాగిన పోరాటాలు, అమరులు పైలా వాసుదేవరావు, కుమారన్న, చంద్రక్క, జయక్క తదితర విప్లవ కమ్యూనిస్టు నేతలు సాగించిన పోరాటాలు ఈనేలలో పోరాట చలనశీలతను రగిలిస్తూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐకెయంయస్ జిల్లా నాయకుడు రాపాక మాధవరావు, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పీవైయల్ జిల్లా కన్వీనర్ సార జగన్, న్యూడెమోక్రసీ సీనియర్ కార్యకర్త జడ్డే అప్పయ్య, ఐ ఎఫ్ టి యు నాయకుడు పోతనపల్లి మల్లేశ్వరరావు, పలు ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# పటిష్టంగా కిషోర్ వికాస్ పథకం అమలు

## - ఖచ్చితంగా పోషణ ట్రాక్ యాప్ లో పిల్లల డేటా
## - పోషకాహార లోపం నివారణకు ప్రత్యేక శ్రద్ధ






**తిరుపతి - సూర్య వాస్తవం**

జిల్లాలో మహిళ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు కిషోర్ వికాస్ పథకం అమలు, పోషకాహార లోపం నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖపై సిడిపీఓ లు, సూపర్వైజర్లు తదితరులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు కిషోర్ వికాస్ పథకం అమలు పోషకాహార లోపం సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్వాడి పనితీరు, అందే సేవలతో పాటు బాలికల సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ చూపాడం తో పాటు బాలికల మీద జరుగుతున్న అత్యాచారాలు, వాటిని నుండి బాలికలు ఎదుర్కొని మార్గాల గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాల్య వివాహాల నివారణ దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బాల్య వివాహాల జరగడం వలన ఆడ పిల్లలు భవిష్యత్తులో ఎదుర్కొనే సమస్యల గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లల పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలని, సంబంధిత అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్లు సమాచారమును సంబంధిత అధికారులకి చేరవేయాలని, సంబంధిత శాఖలు పిల్లల పట్ల త్వరిత గతిన స్పందించి వారి రక్షణ సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు, బాలింతలు, గర్భవతులకు పోషకాహార లోపం నివారణ దిశగా గుడ్లు సక్రమంగా అందేలా నాణ్యతగా ఉండేలా పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని సిడిపిఓలు సూపర్వైజర్లకు ఆదేశించారు. పోషణ ట్రాక్ యాప్ ద్వారా అంగన్వాడి పిల్లల వివరాలను కచ్చితంగా నమోదు చేసేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, డిసిపిఓ శివ శంకర్, సిడిపిఓలు, సూపర్వైజర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

---

## అభ్యర్థులు సకాలంలో
# పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

## - జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్



**తిరుపతి - సూర్య వాస్తవం:** ఉచిత మెగా డిఎస్సి కోచింగ్ కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో త్వరలో మెగా డిఎస్సి నోటిఫికేషన్ రానున్న సందర్భంగా ఉచిత కోచింగ్ నిర్వహణకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహణకు సంబంధిత అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10 వ తేదీన ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాలు తిరుపతి నందు చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, కరకంబాడి రోడ్డు నందు గల శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల, పుత్తూరు సమీపంలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల నందు నిర్వహించబడుతుందని తెలిపారు. పరీక్షా సమయం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థులు జ్ఞాన భూమి వెబ్సైట్ నందు హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకొని పరీక్షా కేంద్రాలకు 10 గంటల లోపుగా చేరుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరములు తీసుకురాకూడదని అన్నారు. అభ్యర్థుల సౌకర్యం కొరకు రవాణా శాఖ వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థుల సౌకర్యం కొరకు ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబర్ 7013008498 ను సంప్రదించవచ్చున్నారు. పరీక్ష కేంద్రంలో విద్యుత్, త్రాగు నీరు, వైద్య తదితర సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఉచిత శిక్షణ కొరకు తిరుపతి జిల్లా నుండి 539 దరఖాస్తులు ఎస్సి, ఎస్టి అభ్యర్థులు సమర్పించారని తెలిపారు. ఈ సమావేశం నందు జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికార అధికారి చెన్నయ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ, ఇతర జిల్లా అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, రవాణా శాఖ, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, తహశీల్దార్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి - సూర్య వాస్తవం:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు కాబడిన పనులు, జిల్లా మినరల్ ఫండ్స్ (డిఎంఎఫ్) ఎంపి ల్యాండ్ కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేసి పురోగతిలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులు, జిల్లా మినరల్ ఫండ్స్(డిఎంఎఫ్) ఎంపీ లాండ్స్ పనుల పురోగతిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, గనులు, భూగర్భ శాఖ, సి పి ఓ సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ.. జిల్లా లో జిల్లా మినరల్ ఫండ్స్(డిఎంఎఫ్) ఎంపీ లాండ్స్ పనుల పురోగతిపై సమీక్షిస్తూ ప్రారంభ దశ లో ఉన్న పనులు మరియు, మిగిలిన పనులలో పురోగతి సాధించి, త్వరితగతిన పూర్తి చేసేల చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ తెలుగంగ, జిఎన్ఎస్ఎస్ మదన్ గోపాల్, ఎస్ ఈ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్,డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )